PRGI RNI : TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

Published From : Rangareddy VOLUME : 01 Issue : 250 Monday 31-08-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

విలేకరులు కావలెను!

మా వార్త సంధ్య పత్రిక మరియు CM NEWS TV టీవీ కోసం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
హైదరాబాద్ & అమరావతి
మరియు జిల్లాల వ్యాప్తంగా కావలెను.

CM NEWS For The People

విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, రాజకీయ మరియు ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు జిల్లా స్థాయి విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

7396122101 vaarthasadhya@gmail.com

9951751662 epaper.vaarthasadhya.com


# నేపాల్ వరదల్లో 760 దాటిన మృతుల సంఖ్య

- 2,500 మందికిపైగా గల్లంతు.. కొనసాగుతున్న గాలింపు చర్యలు
- గుర్తు తెలియని మృతదేహాలు అక్కడే ఖననం
- డీఎన్ఏ నమూనాలు సేకరించి 1.5 మీటర్ల లోతులో ఖననం
- భవిష్యత్ గుర్తింపుకోసం సమాధుల వద్ద సైన్‌బోర్డులు
- మృతదేహాల భద్రపరిచేందుకు ఇళ్లనే కూలింగ్ సెంటర్లుగా మార్పు
- పెరుగుతున్న నదుల నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- భారీ ప్రవాహంలో కొట్టుకుపోయిన మృతదేహాల కోసం కొనసాగుతున్న అన్వేషణ

02

నేపాల్‌ను ముంచెత్తిన వరదలు అపూర్వ విషాదాన్ని మిగిల్చాయి. మృతుల సంఖ్య 760 దాటగా, 2,500 మందికిపైగా ఇంకా గల్లంతయ్యారు. గుర్తు తెలియని మృతదేహాలను భద్రపరచేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రత్యేక విధానంలో డీఎన్ఏ నమూనాలు సేకరించి అక్కడికక్కడే ఖననం చేస్తున్నారు. భవిష్యత్తులో గుర్తింపు కోసం సమాధుల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెరుగుతున్న నదుల నీటిమట్టం, కొనసాగుతున్న వర్షాలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి.





02

## హిమాలయాల్లో 'మంచు' ముప్పు

- భారత్‌లోనూ హైరిస్క్ సరస్సులు.. బద్దలైతే జలప్రళయమే!
- హిమాలయాల్లో 7,500 హిమానీనద సరస్సులు
- భారత్‌లో 195 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా గుర్తింపు
- సిక్కింలోనే 25 హైరిస్క్ సరస్సులు.. గంగా పరివాహక ప్రాంతంలో 4,700 సరస్సులు



## మహిళలే 'సెల్' రాణులు!

- సెల్‌ఫోన్ వినియోగంలోనే కాదు.. నిర్లక్ష్యంలోనూ వారే టాప్
- సోషల్ మీడియా వాడకంలో 79 శాతం వాటా అతివలదే
- తెలంగాణలోనూ భారీగా ఇంటర్నెట్ వాడకం
- వన్ అసిస్ట్, హాన్సా రీసెర్చ్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్,

మొబైల్ వినియోగంలోనే కాదు... వాటివల్ల ప్రమాదాల్లో పడుతున్నారు... ఫోన్‌ను అజాగ్రత్తగా పడేస్తున్న ఘటనల్లోనూ మహిళలే ముందువరుసలో ఉన్నారు. వన్ అసిస్ట్, హాన్సా రీసెర్చ్ సంయుక్తంగా జరిపిన ఒక అధ్యయనంలో మొబైల్ సేఫ్టీ, వినియోగానికి సంబంధించి కీలక విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలో, దేశంలో 82 శాతం మంది జీవనం ఒక్కసారైనా తమ స్మార్ట్‌ఫోన్‌ను చేజార్చి కింద పడేసినట్టు, 72 శాతం మంది ఫోన్ డ్యామేజ్‌ను ఎదుర్కొన్నట్లు వెల్లడైంది. సోషల్ మీడియా వినియోగం మహిళల్లో 79 శాతం ఉండగా, పురుషుల్లో 69 శాతంగా ఉంది. సెల్‌ఫోన్‌ను ప్రమాదవశాత్తు కింద పడేసిన వారిలో మహిళలు 94 శాతం, పురుషులు 80 శాతంగా ఉన్నారు. డ్యామేజ్

-మిగతా 2 లో

# కేబినెట్ ప్రక్షాళన షురూ

## సురేఖ సహా ముగ్గురిపై వేటు?

- ముగ్గురు కొత్తవారికి మంత్రి పదవులు
- విజయశాంతి పేరు పరిశీలనలో..
- మహేశ్‌గౌడ్‌కు కేబినెట్‌లో చోటు?
- పీసీసీ పగ్గాలు బీసీ మంత్రికి?
- స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు మంత్రి పదవి?
- కొత్త స్పీకర్‌గా ఎస్సీ నేతకు అవకాశం
- సెప్టెంబరు 3న ఢిల్లీలో కీలక భేటీ
- అధిష్ఠానంతో చర్చల తర్వాత తుది నిర్ణయం
- వినాయక చవితికి ముందే ప్రక్షాళన?

హైదరాబాద్ :

తెలంగాణ కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధమైంది. కొండా సురేఖ వివాదం వేళ పూర్తి స్థాయిలో మంత్రివర్గంలో మార్పుల దిశగా కసరత్తు జరుగుతోంది. ఇందుకు ముహూర్తం ఖరారైంది. అదే సమయంలో పీసీసీ చీఫ్, స్పీకర్ సైతం మారుతారని పార్టీ నేతల సమాచారం. ఈ ఇద్దరినీ రేవంత్ మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. అదే విధంగా సురేఖతో పాటుగా మరో ఇద్దరు మంత్రుల పై వేటు పడనుందని తెలుస్తోంది. కొత్తగా మంత్రులు అయ్యే వారి పైనా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. తెలంగాణ మంత్రివర్గంలో మార్పులు జరగనున్నాయి. సెప్టెంబరు 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్కుమార్ గౌడ్ను ఢిల్లీకి రావాల్సిందిగా అధిష్ఠానం సూచించింది.

-మిగతా 2 లో





02

## ముస్లిం దేశాలు ఏకతాటిపైకి రావాలి

- అసలైన శత్రువుకు వ్యతిరేకంగా ఏకమవుదాం
- ముస్లిం దేశాలకు ఖమేనీ పిలుపు
- విభేదాలు శత్రువులకు లాభమన్న ఖమేనీ
- ప్రవక్త జయంతి సందర్భంగా ఐక్యతా సందేశం
- ఇస్లాం శక్తి సంఘీభావంలోనే ఉందని వ్యాఖ్య
- గల్ఫ్ దేశాల ఐక్యతపై ఖమేనీ దృష్టి
- అసలైన శత్రువుపై పోరుకు పిలుపు



02

## సెప్టెంబరు 5న ఢిల్లీకి సీజేపీ మార్చ్

- మూడు డిమాండ్లు ఇంకా పెండింగ్‌లోనే
- విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి
- ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరించుకోవాలని డిమాండ్

# కాంగ్రెస్ పాలనలో అప్పుల ఊబిలోకి తెలంగాణ

## కమిషన్ల కోసమే పాలన.. కేంద్ర నిధులతోనే అభివృద్ధి




రూ.13 లక్షల కోట్ల అప్పుల్లోకి రాష్ట్రం

- కాంగ్రెస్ పాలనపై కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు
- అభివృద్ధి పనుల్లో కమిషన్ల దందా: కిషన్‌రెడ్డి
- కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు
- వికారాబాద్ రైల్వే స్టేషన్‌కు రూ.27 కోట్లు
- ఏడాది చివరికల్లా ఆధునికీకరణ పనులు పూర్తి
- 42 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి చర్యలు
- కవచ్ సాంకేతికతతో రైలు ప్రమాదాలకు అడ్డుకట్ట
- రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలి
- పది ఎకరాల్లో ఒక ఎకరం ప్రకృతి సాగు చేయాలి
- రసాయన ఎరువుల వాడకానికి ఫుల్‌స్టాప్ పెట్టాలి
- వికారాబాద్, తాండూరులో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి/తాండూరు,

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ, దగా పాలన సాగిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. సీఎంతో పాటు పలువురు మంత్రులు అభివృద్ధి పనుల్లో కమిషన్లకే మొగ్గు చూపుతున్నారని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని గత, ప్రస్తుత ప్రభుత్వాలు రూ.13 లక్షల కోట్లతో అప్పుల్లోకి నెట్టాయని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు రెండూ దొంగేనని విమర్శించారు. అదే సమయంలో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని, పది ఎకరాల్లో కనీసం ఒక ఎకరం ప్రకృతి సాగుకు కేటాయించాలని పిలుపునిచ్చారు.

-మిగతా 2 లో



02

## దేశంలో ముస్లింలు ఉండొద్దనే వారు హిందువే కాదు

- జీవనశైలి వేరైనా.. అందర్నీ కలిపేది ఏకత్వమే
- విశ్వాసాన్ని నిలబెట్టే మూలసూత్రం ధర్మం
- సత్యాన్వేషణ ద్వారా మోక్షం మానవజన్మ లక్ష్యం
- కర్మభూమి పట్ల విధేయతను కలిగి ఉండాలి
- యూనివర్స్ వన్ నెస్ సెలబ్రేషన్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సందేశం



02

## మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత గౌరవ

- ద్వైపాక్షిక బంధాల బలోపేతానికి గుర్తింపు
- ఇరు దేశాల స్నేహానికి పురస్కారం అంకితం
- తాష్కెంట్‌లో అధ్యక్షుడు షవ్‌కట్ చేతుల మీదుగా ప్రదానం
- వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణపై చర్చలు
- రక్షణ, ఇంధన రంగాల్లో సహకారానికి ప్రాధాన్యం



## ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా ప్రజా ప్రభుత్వం

- రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా
- విద్య, వైద్యం, రహదారి, నీటిపారుదల రంగాల అభివృద్ధికి భారీగా నిధులు
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- చింతకాని, బోనకల్ మండలాల్లో రూ. 131.61 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,

దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మధిర నియోజకవర్గంలోని చింతకాని, బోనకల్ మండలాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వ్యవసాయ రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చింతకాని మండలంలోని కొడుమూరు ఎస్సీ కాలనీలో రూ. 66 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి,

-మిగతా 2 లో

vaartha sandhya వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

# మహిళలే 'సెల్'రాణులు!

మొదటి తరువాయి

ఎదుర్కొన్నవారిలోనూ మహిళలు 79 శాతం, పురుషులు 71 శాతంగా నమోదు అయినట్లు నివేదికలో వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం 26 నుండి 30 సంవత్సరాల వయసు వారు స్మార్ట్ ఫోన్లపై ఎక్కువగా ఆధారపడుతున్న వర్గంగా నిలిచారు. కమ్యూనికేషన్, డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, వినోదం వంటి కార్యకలాపాలకు యువత మొబైల్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నారని తేలింది.

సేఫ్టీలో నిర్లక్ష్యం

సెల్‌ఫోన్ సేఫ్టీ విషయంలో మాత్రం చాలా మంది నిర్లక్ష్యంగానే ఉంటున్నారు. ఇవే కాదు ఈ రీసెర్చ్ ద్వారా మరికొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. మొబైల్ రక్షణ విషయంలో ప్రస్తుతం 6 నుంచి 8 శాతం మందికి మాత్రమే యాక్టివ్ ప్రొటెక్షన్ ప్లాన్ ఉన్నట్లు నివేదిక ద్వారా వెల్లడైంది. చాలామందికి స్మార్ట్‌ఫోన్ కింద పడిందంటే గుండె ఆగినంత పనవుతోంది. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ ఆందోళన మరింత ఎక్కువగా ఉంది. మొబైల్ పడినప్పుడు 43 శాతం మంది మహిళలు ఆందోళన చెందుతుండగా, ఇది పురుషుల్లో 33 శాతంగా నివేదిక పేర్కొంది.

ఫోన్ తడిస్తే బియ్యంలో పెడుతున్నారు...!

చాలామంది అనుకోకుండా ఫోన్ నీటిలో తడిసి పోతే వెంటనే సర్వీస్ సెంటర్కు తీసుకెళ్లడం కంటే సొంత చిట్కాలనే ఆశ్రయిస్తున్నారు. అందులో భాగంగానే ఎక్కువ మంది నీటిలో పడిన మొబైల్ను బాగు చేయాలనే ఉద్దేశంతో 29 శాతం మంది ఫోన్ వాటర్‌లోపడితే బియ్యంలో పెట్టినట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. మిగిలిన ఫోన్ మరింత విడిపోకుండా ఉండేందుకు 20 నుండి 32 శాతం మంది టేప్ లేదార్లతో రు వేయడం వంటి ఇతర తాత్కాలిక పద్ధతులను ఉపయోగిస్తున్నారని నివేదిక పేర్కొంది. పాత ఫోన్లను ఎక్కువ రోజులు వాడడం, ఫోన్ మార్చుకోవడం, సెకండ్ హ్యాండ్ పరికరాలు కొనుగోలు చేయడం పెరుగుతోంది. 70 శాతం మంది కొత్త ఫోన్ల కంటే సెకండ్ హ్యాండ్ పరికరాలకే ప్రొటెక్షన్ ప్లాన్లు మరింత అవసరమని భావిస్తున్నారు. వారంటీ లేదా ప్రొటెక్షన్ ప్లాన్ ఉండే సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలిస్తామని 30 శాతం మంది చెప్పినట్లు అధ్యయనంలో వెల్లడైంది. మెట్రో నగరాల్లో సెకండ్ హ్యాండ్ స్మార్ట్‌ఫోన్లు కొనుగోలు చేసిన వారు 30 శాతం కాగా, నాన్-మెట్రో నగరాల్లో ఈ సంఖ్య 54 శాతానికి చేరిందని ది గ్రేట్ ఇండియన్ స్మార్ట్‌ఫోన్ ప్రొటెక్షన్ క్రిసిస్ నివేదిక పేర్కొంది.

# తెలంగాణ కేబినెట్ ప్రక్షాళన షురూ

మొదటి తరువాయి

మూడో తేదీన జరగనున్న చర్చల్లో కొండా సురేఖ వ్యవహారంతోపాటు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కూడా కీలక నిర్ణయాల దిశగా కసరత్తు చేయనున్నారు. కొండా సురేఖ వివాదానికి సంబంధించి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదిక ఇప్పటికే ఏఐసీసీకి చేరింది. దీంతో, ఢిల్లీ పర్యటన తరువాత మంత్రివర్గం ప్రక్షాళన ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. సురేఖ తో గతంలో వివాదాస్పదంగా వ్యవహరించి.. సీఎం ఆగ్రహానికి గురైన మంత్రితో పాటుగా.. మరో మంత్రిపైనా వేటు ఖాయమని చెబుతున్నారు. వారి స్థానంలో ముగ్గురు కొత్తగా కేబినెట్ లో ఛాన్స్ దక్కనుంది. సురేఖ స్థానంలో ఎమ్మెల్సీ విజయ శాంతి పేరు ఖాయమైనట్లు సమాచారం.

ఢిల్లీకి సీఎం.. కీలక మార్పులు

కాగా, సీఎం రేవంత్ కేబినెట్ లోకి విప్ అది శ్రీనివాస్ కు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. మహిళతో భర్తీ చేయాలంటే కేకే కుమార్తె విజయ లక్ష్మి పేరు వైపు మొగ్గు చూపుతున్నట్లుగా పార్టీలో ప్రచారం సాగుతోంది. అదే విధంగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ను కేబినెట్ లోకి తీసుకొని.. ప్రస్తుత కేబినెట్ లో బీసీ మంత్రికి టీపీసీసీ పగ్గాలు ఇవ్వాలని భావిస్తున్నారు. అదే విధంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ ను సైతం కేబినెట్ లోకి తీసుకుంటారని.. ఆయన స్థానంలో ఉమ్మడి కరీంనగర్ ఎస్సీ వర్గానికి చెందిన మంత్రిని స్పీకర్ గా చేస్తారని ప్రచారం సాగుతోంది. గ్రేటర్ ఎన్నికల వేళ హైదరాబాద్ పరిధిలోని నేతకు అవకాశం ఇవ్వాలనే చర్చ జరుగుతోంది. దీంతో.. ఢిల్లీ భేటీలో ఈ మొత్తం సమీకరణాల పైనా చర్చించి.. తుది రూపు ఇవ్వనున్నారు. అయితే.. కేబినెట్ ప్రక్షాళన మాత్రం వినాయక చవితికి ముందే జరగటం ఖాయమని తెలుస్తోంది.

# నేపాల్ వరదల్లో 760 దాటిన మృతుల సంఖ్య

- 2,500 మందికిపైగా గల్లంతు.. కొనసాగుతున్న గాలింపు చర్యలు
- గుర్తు తెలియని మృతదేహాలు అక్కడే ఖననం
- డీఎన్ఏ నమూనాలు సేకరించి 1.5 మీటర్ల లోతులో ఖననం
- భవిష్యత్ గుర్తింపుకోసం సమాధుల వద్ద సైన్‌బోర్డులు
- మృతదేహాల భద్రపరిచేందుకు ఇళ్లనే కూలింగ్ సెంటర్లుగా మార్పు
- పెరుగుతున్న నదుల నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- భారీ ప్రవాహంలో కొట్టుకుపోయిన మృతదేహాల కోసం కొనసాగుతున్న అన్వేషణ



నేపాల్ వరదల్లో మరణించిన వారి సంఖ్య 760 దాటింది. గల్లంతైన వారి సంఖ్య 2,500 వరకు ఉంది. ఇంకా అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అక్కడి వరదల్లో మరణించిన వారికి సంబంధించి గుర్తు తెలియని మృతదేహాల్ని అక్కడే ఖననం చేస్తున్నారు. మృతదేహాల్ని భద్రపరిచే విషయంలో కూడా నేపాల్ ఇబ్బందులు ఎదుర్కొంటోంది.మృతదేహాల్ని భద్రపరిచే పరిస్థితులు కూడా అక్కడ లేవు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని మృతదేహాల్ని కూడా అక్కడే ఖననం చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. మృతదేహాల్ని ప్లాస్టిక్ ఎయిర్‌టైట్ బ్యాగుల్లో, 1.5 మీటర్ల లోతులో పాతిపెడుతున్నారు. ఇలా పాతిపెట్టే ముందు వారికి సంబంధించిన డీఎన్ఏ శాంపిల్, ఇతర ఆధారాలు సేకరిస్తున్నారు. ఒక్కో మృతదేహానికి మధ్య 40 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూస్తున్నారు. భవిష్యత్తులో వారికి సంబంధించిన వారిని గుర్తించేందుకు వీలుగా ఈ పని చేస్తున్నామని నేపాల్ ప్రధాని బాలెన్ షా వెల్లడించారు. మృతదేహాల్ని ఖననం చేసిన ప్రదేశంలో పైన సిమెంట్‌తో ఒక ప్లాట్‌ఫాం, సైన్ బోర్డు వంటివి కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. కొన్ని చోట్ల మృతదేహాలు పాడవ్వకుండా ఇండ్లనే కూలింగ్ సెంటర్లుగా మార్చారు. మృతదేహాల్ని అక్కడే దాచేస్తున్నారు. మరోవైపు సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. అక్కడి నదుల్లో నీటి మట్టం ఇంకా పెరుగుతోంది. భారీగా నీటి ప్రవాహం ఉండటంతో అనేక మృతదేహాలు నీళ్లలో చాలా దూరం కొట్టుకుపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా వర్షం, వరదల కారణంగా సహాయక చర్యలు సరిగ్గా సాగడం లేదు.

# ముస్లిం దేశాలు ఏకతాటిపైకి రావాలి

- అసలైన శత్రువుకు వ్యతిరేకంగా ఏకమవుదాం
- ముస్లిం దేశాలకు ఖమేనీ పిలుపు
- విభేదాలు శత్రువులకు లాభమన్న ఖమేనీ
- ప్రవక్త జయంతి సందర్భంగా ఐక్యతా సందేశం
- ఇస్లాం శక్తి సంఘీభావంలోనే ఉందని వ్యాఖ్య
- గల్ఫ్ దేశాల ఐక్యతపై ఖమేనీ దృష్టి
- అసలైన శత్రువుపై పోరుకు పిలుపు



టెహ్రాన్

అసలైన శత్రువుకు వ్యతిరేకంగా ఏకమవ్వాలని ముస్లిం దేశాలకు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ఈ మేరకు తన టెలిగ్రామ్ ఖాతాలో లిఖితపూర్వక సందేశాన్ని విడుదల చేశారు. తెలిసి, తెలియక ముస్లింల మధ్య విభేదాలు సృష్టించేవారు ఇస్లాం శత్రువులకు సహాయం చేస్తారని తెలిపారు. గల్ఫ్ ప్రజలు, ప్రభుత్వాలు ఇస్లాం ఐక్యంగా ఉంటే గుర్తింపు లేని పోకిరీలు ఆస్తులు ఆశించే ధైర్యం చేస్తారా అని గల్ఫ్ అరబ్ పాలకులను ఉద్దేశించి ఖమేనీ అన్నారు.

# సెప్టెంబరు 5న ఢిల్లీకి సీజేపీ మార్చ్

**మూడు డిమాండ్లు ఇంకా పెండింగ్‌లోనే**
**విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి**
**ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరించుకోవాలని డిమాండ్**



న్యూఢిల్లీ:

సీజేపీ పోరుబాట పట్టింది. తాము ప్రభుత్వం ముందు ఉంచిన నాలుగు డిమాండ్లలో మూడు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని కాక్రోచ్ జనతా పార్టీ శనివారం ఒక పోస్టులో తెలిపింది. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వడం, ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవడం, విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని హామీ ఇవ్వాలని సీజేపీ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల సాధనకు సెప్టెంబర్ 5న ఢిల్లీలో మార్చ్ నిర్వహించనున్నామని, ఈ నిరసనలో పాల్గొనాలని సీజేపీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. నీట్ పేపర్ లీక్, పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలను నిరసిస్తూ సీజేపీ జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టింది.

# కాంగ్రెస్ పాలనలో అప్పుల ఊబిలోకి తెలంగాణ

మొదటి తరువాయి



ఆదివారం ఆయన వికారాబాద్ జిల్లాలో పర్యటించారు. ముందుగా ఆయన వికారాబాద్ జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్ లో ఆధునికీకరణ పనులను పరిశీలించారు. అనంతరం తాండూరు పట్టణంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో వికారాబాద్ జిల్లా నూతన బీజేపీ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అభివృద్ధి పనుల్లో 30 శాతం వరకు కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కేంద్ర పథకాలను సైతం రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులు తమ ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు.

దేశంలో బీజేపీకి 18 కోట్ల మంది సభ్యత్వం ఉందని, ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఎదిగిందని తెలిపారు. తెలంగాణలో బీజేపీకి అవకాశం ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, తాండూరు గడ్డపై కూడా బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

వికారాబాద్ రైల్వే స్టేషన్ కు రూ. 27 కోట్లు

అంతకుముందు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ముందుగా పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. అధికారులను అడిగి పనుల పురోగతిని తెలుసుకుని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.27 కోట్లతో ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఏకకాలంలో 42 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది చివరి నాటికి వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రెండు ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులు, క్యాంటీన్, దివ్యాంగులకు ఆధునిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్‌ను 50కి, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌ను 150కి పెంచినట్లు వివరించారు.

కవచ్‌తో రైలు ప్రమాదాలకు చెక్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో రైల్వే రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని, కవచ్ టెక్నాలజీ ద్వారా రైలు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు బడ్జెట్ ట్రైన్ వస్తే రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తుందని అన్నారు. బుల్లెట్ ట్రైన్ సేవలు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. వికారాబాద్ రైల్వే స్టేషన్‌కు సంబంధించిన అండర్ బ్రిడ్జి సమస్యల పరిష్కారానికి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి కేంద్ర రైల్వే మంత్రితో చర్చిస్తామని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే జాతీయ రహదారి పనులను కూడా పూర్తి చేస్తామని చెప్పారు.


పది ఎకరాల్లో ఒక ఎకరం ప్రకృతి సాగు

అనంతరం తాండూరు మండలం చెంగాల్‌రెడ్డి గ్రామం సమీపంలోని ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. సందీపని గురుకులంలో నిర్మించిన పలు భవనాలను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. పది ఎకరాల్లో కనీసం ఒక ఎకరం ప్రకృతి వ్యవసాయానికి కేటాయించాలని పిలుపునిచ్చారు. దిగుబడి కోసం రసాయన ఎరువుల వినియోగం వల్ల భూసారం క్షీణిస్తోందని, రసాయనాలతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు, కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెంచడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చని అన్నారు.

# మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత గౌరవం

**ద్వైపాక్షిక బంధాల బలోపేతానికి గుర్తింపు**
**ఇరు దేశాల స్నేహానికి పురస్కారం అంకితం**
**తాష్కెంట్‌లో అధ్యక్షుడు షవ్‌కట్ చేతుల మీదుగా ప్రదానం**
**వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణపై చర్చలు**
**రక్షణ, ఇంధన రంగాల్లో సహకారానికి ప్రాధాన్యం**

తాష్కెంట్



ప్రధాని మోదీకి ఆదివారం ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్‌కట్ మిర్జియోయెవ్ తమ దేశ అత్యున్నత పురస్కారం ఆర్డర్ ఆఫ్ 'ఓలియ్ దరజలీ దస్ట్‌లిక్'ను తాష్కెంట్‌లో ప్రదానం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఇరు దేశాల స్థిరమైన స్నేహానికి, దగ్గరి సంబంధాలకు ఈ పురస్కారాన్ని మోదీ అంకితం చేశారు. ప్రతినిధుల స్థాయిలో జరిగిన చర్చల్లో మోదీ, షవ్‌కట్ పాల్గొని ఆర్థికం, వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ అనుసంధానం, రక్షణ, ఎనర్జీ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి సారించాలని నిర్ణయించారు.

# హిమాలయాల్లో 'మంచు' ముప్పు

**భారత్‌లోనూ హైరిస్క్ సరస్సులు.. బద్దలైతే జలప్రళయమే!**
**హిమాలయాల్లో 7,500 హిమానీనద సరస్సులు**
**భారత్‌లో 195 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా గుర్తింపు**
**సిక్కింలోనే 25 హైరిస్క్ సరస్సులు.. గంగా పరివాహక ప్రాంతంలో 4,700 సరస్సులు**




న్యూఢిల్లీ : నేపాల్ లో ఇటీవల సంభవించిన హిమానీనద విపత్తు భారత్ కు మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. హిమాలయ పర్వతాల్లోని మంచు సరస్సులు బద్దలైతే ఎంతటి విధ్వంసం సంభవిస్తుందో నేపాల్ ఘటన స్పష్టం చేస్తోంది. అదే సమయంలో భారత్లో కూడా వందల సంఖ్యలో ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దీంతో వాటిపై నిరంతర నిఘా, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ సర్వే ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలో దాదాపు 7,500 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వీటిలో సుమారు 10 శాతం అంటే దాదాపు 750 సరస్సులు సిక్కింలోనే ఉన్నట్లు అంచనా. వీటిలో 25 సరస్సులను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. హిమాలయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరుగుదల, వర్షపాతంలో మార్పులు వంటి పరిణామాలు ఆ సరస్సులపై ప్రభావం చూపుతున్నాయి.

దిగువ ప్రాంతాల్లో విధ్వంసం!

హిమానీనదాల నుంచి కరిగిన మంచు, నీరు చేరి ఏర్పడే సరస్సులు కాలక్రమంగా భారీగా విస్తరించే అవకాశం ఉంటుంది. సరస్సులను చుట్టుముట్టిన మంచు, రాళ్ల గోడలు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు రావచ్చు. దీనినే గ్లేషియల్ లేక్ ఔట్ బర్స్ట్ ఫ్లడ్ (జీఐఓఎఫ్ ) అంటారు. ఇలాంటి వరదలకు భారీ నీటితోపాటు మట్టి, రాళ్లు, మంచు కూడా కలవడంతో దిగువ ప్రాంతాల్లో విధ్వంసం మరింత పెరుగుతుంది. అయితే భారత్ లో హిమానీనద సరస్సుల ముప్పు సిక్కింకే పరిమితం కాదు. గంగా నదీ పరివాహక ప్రాంతంలోనూ సుమారు 4700 సరస్సులు ఉన్నట్టు అంచనాలు వెలువడుతున్నాయి. ఆ నదీ పరివాహక ప్రాంతం 2.5 లక్షల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉంది. వీటిలో ఏదైనా అత్యంత ప్రమాదకర సరస్సు ఒక్కసారిగా బద్దలైతే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర కీలక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో లోయలు ఇరుకుగా ఉండటంతో వరద ప్రవాహం మరింత వేగంగా కిందకి దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది.

# దేశంలో ముస్లింలు ఉండొద్దనే వారు హిందువే కాదు

- జీవనశైలి వేరైనా.. అందర్నీ కలిపేది ఏకత్వమే
- విశ్వాసాన్ని నిలబెట్టే మూలసూత్రం ధర్మం
- సత్యాన్వేషణ ద్వారా మోక్షం మానవజన్మ లక్ష్యం
- కర్మభూమి పట్ల విధేయతను కలిగి ఉండాలి
- యూనివర్స్ వన్ నెస్ సెలబ్రేషన్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సందేశం



న్యూయార్క్:

భారతదేశంలో ముస్లింలకు స్థానం లేదని భావించే హిందువు నిజమైన హిందువు కాదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ అన్నారు. హిందుత్వం అనేది అందరినీ కలుపుకొని వెళ్లే జీవన విధానమని, వైవిధ్యాన్ని గౌరవించడం, పరస్పర సహజీవనాన్ని ప్రోత్సహించడం దాని మూల స్ఫూర్తి అని ఆయన పేర్కొన్నారు. భారతదేశం అనేక మతాలు, భాషలు, సంస్కృతులు, సంప్రదాయాల సమాహారమని చెప్పారు. ఈ వైవిధ్యమే దేశ బలమని, ఏ మతానికి చెందిన వారైనా సమాన గౌరవం, సమాన హక్కులతో జీవించే అవకాశాన్ని భారతీయ సంస్కృతి కల్పిస్తుందని వివరించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన 'వన్ వరల్డ్ వన్ హ్యూమానిటీ' కార్యక్రమంలో భగవత్ మాట్లాడుతూ, ప్రయాణికులలో ఎక్కువ మంది ముస్లింలేనని భగవత్ తెలిపారు. ప్రమాద స్థలానికి ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు చేరుకుని సహాయక చర్యలలో పాలుపంచుకున్నారని ఆయన గుర్తుచేసుకున్నారు. హిందుత్వాన్ని సంకుచిత దృక్పథంతో చూడడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు. అందరినీ అంగీకరించడం, పరస్పర గౌరవం, సహనం, సమరసత వంటి విలువలే హిందూ ఆలోచనా విధానానికి పునాదులని పేర్కొన్నారు. ఇతర మతాలను వ్యతిరేకించడం లేదా వారిని దేశానికి దూరంగా ఉంచాలని కోరుకోవడం భారతీయ నాగరికత స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. సమాజంలో విభజన కంటే ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని భగవత్ తెలిపారు. మతం, భాష, ప్రాంతం ఆధారంగా ప్రజల మధ్య విద్వేషాలు పెరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. దేశాభివృద్ధి, సామాజిక సామరస్యం కోసం అన్ని వర్గాల ప్రజలు పరస్పర విశ్వాసంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారతదేశం బలం దాని బహుళత్వంలోనే ఉందని, రాజ్యాంగం కూడా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, గౌరవప్రదమైన జీవనానికి హామీ ఇస్తుందని మోహన్ భగవత్ గుర్తు చేశారు. పరస్పర విశ్వాసం, సహకారం, సామాజిక సామరస్యం బలోపేతం అయినప్పుడే దేశం మరింత ప్రగతి సాధిస్తుందని పేర్కొన్నారు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా ప్రజా ప్రభుత్వం

మొదటి తరువాయి

లచ్చగూడెంలో రూ. 29 కోట్లతో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి, రూ. 1.75 కోట్లతో లచ్చగూడెం -- నేరడ మేజర్ రహదారి వరకు చింతకాని -- వందనం ఆంజనేయస్వామి ఆలయం నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ. 7 కోట్లతో లచ్చగూడెం -- అనంతారం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. చింతకాని గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ. 44 లక్షలతో, నాగిలిగొండ ఎస్సీ కాలనీలో రూ. 85 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, నాగిలిగొండ నుంచి తూటికుంట్ల వరకు రూ. 5.25 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. బోనకల్ మండలంలోని నారాయణపురం ఎస్సీ కాలనీలో రూ. 63 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, రూ. 1 కోటితో ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, రాయన్నపేట ఎస్సీ కాలనీలో రూ. 19 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. నారాయణపురంలో రూ. 80.84 లక్షలతో నిర్మించిన 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పిఎసిఎస్ గోదాము, మోటమర్రిలో రూ. 24.50 లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పిఎసిఎస్ గోదాము డిప్యూటీ సీఎం ప్రారంభించారు. అదేవిధంగా కలకోట - రాపల్లి -- గొస్సవీడు -- మసకలమడుగు -- లక్ష్మీపురం రహదారిని రూ. 57 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 20/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసే పనులకు, బ్రాహ్మణపల్లి -- గొస్సవీడు మీదుగా రావెల వరకు ఉన్న పిడబ్ల్యూడీ రహదారిని రూ. 26 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 8/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసే పనులకు శంకుస్థాపనలు చేశారు. రాపల్లిలో రూ. 20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు కూడా డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ నేటి ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం కోసం అనేకకార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డుల ద్వారా సబ్సిడీబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, 53 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి పథకం క్రింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంచామని తెలిపారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఒక్కొక్క ఇంటికి రూ. 5 లక్షల చొప్పున ఇప్పటి వరకు 7 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని అన్నారు. నిరుద్యోగ యువత కోసం తొలి ఏడాదిలో 70 వేలకు పైగా నియామక పత్రాలు పంపిణీ చేశామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

# సెప్టెంబర్ 1 నుంచి సేవాలాల్ మహా పాదయాత్ర

-మహారాష్ట్ర వరకు నిర్వహణ.. విజయవంతం చేయాలని రాష్ట్రీయ గోర్ సేన పిలుపు







**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య ) ఆగస్టు 30** ఆదివారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ సందేశాన్ని విస్తరించడం ఐక్యత ఐక్యంగా ఆదర్శంగా బంధాన్ని బలోపేతం చేయడం జరుగుతుందని తెలిపారు సంస్కృతి ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడడం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు సమాజసేవ అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం పవిత్ర స్థలాల మధ్య అవసరంలో ఉన్నవారికి అనుబంధాన్ని చాటి చెప్పడం జరుగుతుందని ఆయన తెలిపారు,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు భావ్ సింగ్ మహారాజ్ మాట్లాడుతూ గోర్ ధర్మ జాగృతి మహా పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ గోర్ సేనా కార్య కర్తలు,సేవాలాల్ సేనా కార్య కర్తలు పలువురు పాల్గొని ప్రసంగించారు...

## ఖైతలాపూర్ ఆంజనేయ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**వార్త సంధ్య కూకట్‌పల్లి**
ఖైతలాపూర్ ఆంజనేయ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన సమక్షంలో కొత్తగా ఎన్నికైన మహేందర్ ప్యానెల్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ఆంజనేయ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడం అభినందనీయమని అన్నారు. ఈసారి ఎన్నికల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కాలనీ సంక్షేమ బాధ్యతలను స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తాను కూడా ఈ కాలనీ సంక్షేమ సంఘంలో భాగస్వామినేనని, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కూడా ఈ కాలనీలోనే ఉందని గుర్తుచేశారు. కాలనీ అభివృద్ధికి, సంక్షేమానికి అవసరమైన ఏ సమస్యలనైనా తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని నూతన కార్యవర్గానికి హామీ ఇచ్చారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఏ, బి బ్లాక్ ఇన్చార్జీలు తూము వేణు, నాగిరెడ్డిలతో పాటు సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, లక్ష్మయ్య, ధర్మారావు, గోవింద్, రమణ మరియు స్థానిక నాయకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేపీ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కార్యాలయం ప్రారంభం



**వార్త సంధ్య కూకట్పల్లి**
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యాలయాన్ని ప్రాంరంభించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, నూతన అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి నేతృత్వంలో ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళా నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జానపద కళారూపాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

తెలంగాణ కళా సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి: నకిరేకంటి కిరణ్‌కుమార్



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) ఆగస్టు 30**
తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జనగామ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యాను. ఈ సందర్భంగా జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, మా రాష్ట్ర వ్యవస్థాపక చైర్మన్ అనువోజు వెంకటేశం , రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న జబర్దస్త్ ఫేమ్ రాజమౌళి కలిసి నన్ను ఘనంగా సత్కరించడం ఎంతో ఆనందాన్ని, ఆత్మీయతను కలిగించింది.

నాపై చూపించిన ఈ గౌరవం, అభిమానం, ఆత్మీయతకు జనగామ జిల్లా కమిటీకి రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కళాభివందనాలు, కృతజ్ఞతలు.

కళాకారుల గౌరవం కోసం...
తెలంగాణ కళా సంస్కృతి పరిరక్షణ కోసం...
ఉద్యమ కళాకారుల సంక్షేమం కోసం...
మన ప్రయాణం నిరంతరం కొనసాగాలి.

నకిరేకంటి కిరణ్ కుమార్
తెలంగాణ కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు
తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

# పట్టణంలో ఓపెన్ జిమ్, పార్కు ఏర్పాటు చేస్తాం



**ఆలేరు టౌను (వార్త సంధ్య ) ఆగస్టు 30**
ఆలేరు పట్టణంలో ప్రజల సౌకర్యార్థం సుందరమైన పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని, ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ అన్నారు. బస్టాండ్ వెనుక సుభాష్ నగర్ కాలనీలో ప్రభాకర్ హాస్పిటల్ వద్ద ఆదివారం మేరా యువభారత్ లో భాగంగా, యూత్ డెవలప్మెంట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమణి మాట్లాడుతూ.. ఆలేరు సమగ్ర అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలను చేపడుతామని చెప్పారు. యువ చైతన్య కార్యక్రమాల గురించి మహేష్ వివరించారు. రిటైర్డ్ టీచర్ బి.బాలరాజు గౌడ్, పాల్గొని యువత మంచి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, వెంకట్, గణేష్, కృష్ణ, రమేష్, వంశీ, నాగరాజు, జీవన్, నాగరాజు, కార్తీక్, వికాస్,టింకు, నిఖిల్, యువజన సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కవాల్ టైగర్ జోన్ రద్దు చేయాలి

అసెంబ్లీలో తీర్మానం చేసి కోర్ సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి




**జన్నారం(వార్త సంధ్య ) ఆగస్టు 30** కవాల్ టైగర్ జోన్‌ను రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని, కోర్ సెన్సిటివ్ జోన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి ఆధ్వర్యంలో శ్రీరాముల భూమాచారి చేపడుతున్న పోరాటానికి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు ఆదివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఖాజా మహమ్మద్ మాట్లాడుతూ.. కోర్ సెన్సిటివ్ జోన్ పేరుతో జన్నారం రేంజ్‌లో సస్పెండ్ చేసిన అటవీ శాఖ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సస్పెన్షన్ కాలానికి సంబంధించిన పూర్తి జీతాలను చెల్లించాలని కోరారు. మంచిర్యాల జిల్లా అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు శనిగరపు వెంకటేష్ మాట్లాడుతూ.. కవాల్ టైగర్ జోన్, కోర్ సెన్సిటివ్ జోన్ కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధికి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను తరలించేందుకు అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు. ప్రజల జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా నిబంధనలను సరళీకరించాలని అన్నారు. జన్నారం మీదుగా ఉట్నూర్ వరకు ఫోర్‌లైన్ ప్రధాన రహదారిని ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం మండల అధ్యక్షులు కోరుట్ల శంకరయ్య, జిల్లా విద్యార్థి సంఘం~~ అధ్యక్షులు బొమ్మిడి అభినయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శనిగరపు రామ్ చరణ్, పార్టీ నాయకులు బొమ్మిడి శ్రీను, బొమ్మిడి రవి, సుల్వరాజు తదితరులు పాల్గొన్నారు. సామాజిక పోరాట సమితి నాయకులు శ్రీరాముల భూమాచారి మాట్లాడుతూ తన పోరాటానికి మద్దతు తెలిపిన సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కవాల్ టైగర్ జోన్, కోర్ సెన్సిటివ్ జోన్ సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# గిరిజన సంప్రదాయాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

-భీక్య తండలో ఘనంగా తీజ్ వేడుకలు

-పాల్గొన్న గిరిజన నాయకుడు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా వీరన్న





**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 30 (వార్త సంధ్య ) కారేపల్లి**
గిరిజన సంప్రదాయాలు, సంస్కృతులను గ్రామస్థాయిలో ప్రభుత్వాలు ప్రోత్సహించి కొనసాగించాలని గిరిజన నాయకుడు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా వీరన్న అన్నారు. ఆదివారం కారేపల్లి మండల పరిధిలోని భీక్య తండ గ్రామంలో తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు గిరిజన యువతులు సంప్రదాయబద్ధంగా తీజ్ వేడుకలను నిర్వహించగా, చివరి రోజు గ్రామంలో అంగరంగ వైభవంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అజ్మీరా వీరన్న మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ గిరిజనుల సంప్రదాయాలు, ఆచారాలను గ్రామాల్లో మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వస్తున్న పాలకులు గిరిజనుల సమస్యలు, సంప్రదాయాల పట్ల వివక్ష చూపకూడదని అన్నారు. తొమ్మిది రోజుల పాటు గిరిజన యువతులు తీజ్ సంప్రదాయాన్ని కొనసాగించడం అభినందనీయమని, భావితరాలకు తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## గ్రామ దేవతలకు బోనాలు సమర్పణ



**ఆలేరు టౌన్ (వార్త సంధ్య ) ఆగస్టు 30**
శ్రావణ మాస బోనాలు పురస్కరించుకొని, ఆలేరు పట్టణంలో ఆదివారం అంగరంగ వైభవంగా మహిళలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో బోనాలు గ్రామదేవతలకు సమర్పించారు. ఈ మేరకు పోచమ్మ దేవాలయం, గడి మైసమ్మ, బొడ్రాయి, కొలను పాక రోడ్డు, పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ, ఉప్పలమ్మ దేవాలయాలకు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాల చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం అమ్మవారికి కుమ్మరి పూజారుల సమక్షంలో మొక్కులు చెల్లించి, నూతన వస్త్రాలు, నైవేద్యం సమర్పించారు. పట్టణం, గ్రామాలు ప్రజలు సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని, కరువు కాటకాలు పారద్రోలాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. ఆలయాల వద్ద మేకలు, గొర్రెపోతులు, కోళ్లు భక్తులు బలి ఇచ్చారు. దేవాలయాలు కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. రాఖీ పౌర్ణమి మరుసటి రోజు ఆదివారం రావడంతో వచ్చిన బంధుమిత్రులతో కలిసి పట్టణమంతా సందడి సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో కుమ్మరి పూజారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాసరలో మహారాష్ట్ర మాజీ సీఎం పూజలు



**ముధోల్(వార్త సంధ్య ) ఆగస్టు 30**
దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన బాసర పుణ్యక్షేత్రంలో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ర రావు చౌహాన్ దంపతులు దర్శించుకున్నారు. ఈ క్రమంలో కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయాధికారులు మాజీ సిఎం దంపతులను ఘనంగా సన్మానించి, అమ్మవారి ఫోటో ప్రసాదాన్ని ఆలయ అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, బాసర మండల బిజేపి అధ్యక్షుడు పుట్నల సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం: ఎమ్మెల్యే

**జన్నారం(వార్త సంధ్య ) ఆగస్టు 30**
జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన దుర్గం లింగారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స అవసరమైన పరిస్థితిలో ఉన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్సకు సుమారు రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన లింగారెడ్డి పరిస్థితిని తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, చికిత్సకు అవసరమైన రూ.4 లక్షల మొత్తానికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎల్ఓసీ మంజూరు చేయించారు. పేదల వైద్య అవసరాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న ఎమ్మెల్యే చొరవపై లింగారెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వార్త సంధ్య

## సంపాదకీయం

# పెన్షన్.. టెన్షన్




'కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్' పేరు వింటేనే 2.60లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల వెన్నులో వణుకు పుడుతుంది. ఈ స్కీమ్‌తో తమ బ్రతుకులకు భరోసాలేదని వారు ఆందోళన చెందుతున్నారు. 2001-02 బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగులకు ఉద్యోగ విరమణానంతరం ఇచ్చే పెన్షన్ లో మార్పు చేయడానికి బి.కె. భట్టాచార్య నేతృత్వంలో ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీ ప్రతిపాదనలను 2003 ఆగస్టు 23వ తేదీన నాటి ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదించింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన యూపిఏ ప్రభుత్వం 2004 జనవరి 1వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వ సర్వీసులో చేరిన ఉద్యోగులకు నూతనంగా నేషనల్ పెన్షన్ (ఎన్పీఎస్) విధానం అమల్లోకి తెచ్చింది. 2004 సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కొలువులో చేరిన సుమారు 2.60లక్షల మంది ఉద్యోగులు సిపిఎస్ పింఛన్ పథకం పరిధిలోకి వచ్చారు. ఇది తెలంగాణ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్య కాదు. దేశవ్యాప్తంగా సుమారు 97లక్షల మంది ఉద్యోగులు సిపిఎస్ పింఛన్ స్కీమ్ పరిధిలో ఉన్నారు. అయితే అనాధిగా అమల్లో ఉన్న ఓల్డ్ పెన్షన్ విధానంలోకి వచ్చే ఉద్యోగులకు ఎంప్లాయిస్ కాంట్రిబ్యూషన్ లేకుండానే ఉద్యోగి రిటైర్‌మెంట్ తర్వాత చివరి బేసిక్ మూల వేతనం నుంచి 50 శాతం సర్వీసు పెన్షన్ రూపంలో అందుతుంది. అలాగే తనకు వచ్చిన పెన్షన్ నుంచి 40 శాతం సొమ్మును ఏకకాలంలో తీసుకునే వెసులుబాటు కూడా ఉంది. దీంతో ఉద్యోగికి, అతని కుటుంబానికి రిటైర్‌మెంట్ తర్వాత కూడా ఓ భరోసా దొరికేది. కానీ, సిపిఎస్ పెన్షన్ స్కీం పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు పెన్షన్ ఓ టెన్షన్ అయి కూర్చుంది. ఎందుకంటే సిపిఎస్ పరిధిలోకి వచ్చే ఉద్యోగుల పెన్షన్ షేర్ మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడి ఉంటుంది. దీంతో పదవి విరమణ పొందిన సిపిఎస్ ఉద్యోగి రిటైర్‌మెంట్ జీవితం ప్రశ్నార్ధకమైంది. రాజ్యాంగంలోని 309వ అధికరణ ద్వారా అందించబడిన అధికారాలను ఉపయోగించి చత్తీస్ ఘడ్, రాజస్థాన్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఓల్డ్ పింఛన్ విధానం (ఓపిఎస్)ను అక్కడి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ప్రస్తుతం "వన్ నేషన్, వన్ ట్యాక్స్" నినాదం ప్రతిధ్వనిస్తున్న మన దేశంలోని ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన పెన్షన్ చట్టాలు అమలు జరుగుతుండటం విచారకరం. కేంద్ర ప్రభుత్వం మెమో - 41 ప్రకారం ప్రభుత్వం 2019 నుంచి ప్రభుత్వ వాటాను 10 శాతం నుంచి 14 శాతానికి పెంచింది. అలాగే మెమో - 57 ప్రకారం 2004 కు ముందు నోటిఫికేషన్‌ల ద్వారా తదనంతరం ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. గెజిట్ నెంబర్ -178 ప్రకారం 2021 నుంచి చనిపోయిన కేంద్ర ప్రభుత్వ ఎన్పిఎస్ ఉద్యోగుల నామినీకి ప్రాన్ అకౌంట్లో ఉన్న ఉద్యోగి కాంట్రిబ్యూషన్ కు చెందిన సొమ్మును ఉద్యోగి కుటుంబానికి ఇస్తూ వారి కుటుంబానికి ఫ్యామిలీ పెన్షన్ ను మంజూరు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ సంస్కరణల్లో ఏ ఒక్క సంస్కరణను కూడా తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం లేదు. అలాగే సిపిఎస్ తో ఆర్థిక భద్రత కోల్పోవడంతో పాటు రిటైర్‌మెంట్ తర్వాత హెల్త్‌కార్డు సదుపాయం లేని ఆరోగ్య భద్రత ను కూడా కోల్పోవాల్సి వచ్చింది. ఓపిఎస్ విధానంలో ఒక ఉద్యోగి సర్వీస్ కాలాన్ని బట్టి దాదాపుగా చివరి నెల బేసిక్ సాలరీలో 50 శాతం ప్రతినెల పెన్షన్ తో పాటు డిఏ పెరుగుదల మాదిరిగానే డిఆర్ కూడా వర్తిస్తుంది. అయితే సిపిఎస్ విధానంలో ఉద్యోగి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ (ప్రాన్) లోని మొత్తంలో 40 శాతం నిధిని ప్రభుత్వం అన్యుటీలలో పెట్టిబడి పెట్టి దానిపై వచ్చే రాబడి రూ.లక్షకు సుమారు రూ.500ల నుంచి రూ.800 మాత్రమే వచ్చే అవకాశం ఉంది. వాస్తవానికి పీఎఫ్ఆర్డీఏ-2004 (పింఛన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలఫ్‌మెంట్ అథారిటీ) చట్ట ప్రకారం సిపిఎస్ పరిధిలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి మూల వేతనం నుంచి 10శాతం, డిఏలో 10శాతం ప్రతినెల ఉద్యోగి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్లో జమ చేయాలి. అంతేస్థాయిలో ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంట్ రూపంలో ఉద్యోగి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ (ప్రాన్) లో జమ చేయాలి. ఇలా జమ అయిన పెన్షన్ సొమ్మును సిఆర్ఏ (సెంట్రల్ రికార్డు కీపింగ్ ఏజెన్సీ) బాధ్యతగా నిర్వహించి ఈ నిధిని నేషనల్ పెన్షన్ సిస్టం ట్రస్టు (ఎన్పీఎస్), నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిట్స్ లిమిటెడ్ (ఎన్ఎస్డీఎల్) ద్వారా షేర్ మార్కెట్ లో పెట్టి తదుపరి పదవీ విరమణ సమయంలో సర్వీస్ మొత్తంలో ఉద్యోగి, ప్రభుత్వ వాటా మొత్తం నిధిలో నిర్ణీత సొమ్మును నెలవారీగా రిటైర్డ్ ఉద్యోగికి పింఛన్ రూపంలో చెల్లించాలి. కానీ, తెలంగాణలో ఈ ప్రక్రియ కూడా సక్రమంగా జరగడం లేదు.ఉద్యోగికి చెల్లించే ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను నిర్ణీత గడువులోపు చెల్లించని కారణంగా పెన్షన్ సెటిల్‌మెంట్ జరగని కారణంగా రాష్ట్రం లో సుమారు 600 మంది రిటైర్డ్ సిపిఎస్ ఉద్యోగులకు ఆ కొద్దిపాటి నెలవారి పెన్షన్ కూడా రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం తాజాగా సిపిఎస్, ఎన్‌పిఎస్ పథకాలకు ప్రత్యామ్నయంగా యూపిఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ పెన్షన్ పథకం) ను అమల్లోకి తీసుకువచ్చింది. 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ కొత్త పెన్షన్ పథకం వర్తిస్తుంది. దీని ప్రకారం ఉద్యోగి తన పదవీ విరమణకు ముందు 12 నెలల్లో అందుకున్న బేసిక్ పే సగటులో 50 శాతం కచ్చితంగా పింఛన్ రూపంలో అందుతుందని కేంద్రం పేర్కొంటుంది. కనీసం 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు మూల వేతనంలో 50 శాతం పెన్షన్ రానుంది. మిగిలిన వారికి సర్వీసును బట్టి పెన్షన్ వర్తిస్తుంది. కానీ, పెన్షన్‌కు కనీస అర్హత సుమారు 10 ఏళ్ల సర్వీసును పూర్తి చేసుకోవాలి. ఉద్యోగి 10శాతం వాటాతో పాటు ప్రభుత్వం క్రమం తప్పకుండా మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ పథకంను అడాప్ట్ చేసుకునే అవకాశం ఉంది. కానీ, అదనపు భారంను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాల్సి ఉంటుంది.

# తెలంగాణలో కమలనాథుల పీఛేముడ్!

ఉత్తరాది పూర్తిగా తమ కైవసం అయిందని, ఇక దక్షిణాది మీద దండయాత్ర మిగిలిందని కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ సంబరపడిపోతున్న సమయంలో, 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో జెన్ జీ రోడ్ల మీదికి వచ్చి బీజేపీ ఆశల మీద నీళ్లు చల్లింది. అదే ఉత్తరాదిలో ఇటీవల పలు రాష్ట్రాల్లో జెన్ జీ ఉద్యమం స్పూర్తిగా జెన్ ఆల్ఫా కూడా రోడ్ల మీదికి వచ్చి ఉద్యమాలు మొదలుపెట్టింది. పాఠశాలల్లో పరిస్థితులు బాగాలేవని, కనీస వసతులు కల్పించాలని, సరైన ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని, గత మూడు వారాలలో పాఠశాల విద్యార్థులు తరగతి గదుల్లోంచి బయటకొచ్చి ప్రభుత్వ కార్యాలయాలకు ఊరేగింపులు తీసారు. స్కూలు గేట్లకు తాళాలు వేశారు. అధికారుల నుంచి సమాధానం కోరుతూ రోడ్లమీద బైఠాయించారు. వారి డిమాండ్లు చాలా మౌలికమైనవి. వాళ్లకు పాఠాలు సరిగ్గా చెప్పే ఉపాధ్యాయులు కావాలి. తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, రాసుకోవడానికి అవసరమైన బల్లలు, సరైన ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, వాడటానికి వీలుగా ఉండే మరుగుదొడ్లు ఈ జెన్ ఆల్ఫా కనీస కోర్కెలు. ఇంకొక పాఠశాల వారైతే స్కూలుకు వెళ్లడానికి సరైన రోడ్డు వేయాలని డిమాండ్ చేసారు. ఇవన్నీ గొంతెమ్మ కోర్కెలు కావు కదా. ఆ పిల్లలు అడగకుండానే ఈ ఏర్పాట్లన్నీ చెయ్యాల్సిన బాధ్యత వాళ్ళ తల్లిదండ్రులు ఓట్లేసి ఎన్నుకున్న ప్రభుత్వాలది కదా. గత మూడు వారాలుగా జెన్ అల్ఫా చేస్తున్న ఈ ఉద్యమాలు భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర , మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే జరిగాయి. రాజస్థాన్ హైకోర్టు అయితే దాదాపు 86,934 తరగతి గదులు సక్రమంగా లేనందున మూసివేయాలని ఆదేశాలు జారీ చేయడం చూశాం. జెన్ జీ స్పూర్తిగా జెన్ అల్ఫా చేస్తున్న ఈ 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమం అధికార బిజెపికి ఉత్తరాదిన ఊపిరాడని పరిస్థితి సృష్టించింది. బిజెపి, ఆర్ఎస్ఎస్ పదేపదే వల్లెవేసే మన పురాణాల్లో ఒకటైన వామనావతారాన్ని వాళ్లకు బీహార్ రాజధాని పట్నాలో ఆరేళ్ల ఆదిత్య కుమార్ చూపించేశాడు. వామనులు, ప్రహ్లాదులు.. ఇప్పుడు ఆదిత్య కుమార్ వంటి చిన్నవాళ్ళేం చేస్తారులే అనుకుంటే ఫలితం ఎలా ఉంటుందో అప్పుడు చూసాం, ఇప్పుడూ చూస్తున్నాం. బలి చక్రవర్తి నెత్తిన తన వామపాదం పెట్టి తొక్కిన వామనుడి అంశగా కనిపించి ఉంటాడు ఈ ఆదిత్య కుమార్ అనే బుడతడు. బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి రాజీనామా కోరుతూ అందుకు కారణాలను ఆదిత్య కుమార్ ఏకరువు పెట్టి బిజెపికి చుక్కలు చూపించాడు. ఆరేళ్ల పసివాడిని అదుపులోకి తీసుకొని, ఆ పిల్లవాడి తల్లిదండ్రులను నిర్బంధించి హింసించడాన్ని సామాజిక మాధ్యమాలు విస్తృత ప్రచారం చేసి ఉత్తరాదిన పోలీసు వ్యవస్థ ఎంత అరాచకంగా తయారయిందో ప్రపంచానికి తెలియజెప్పి బీజేపీ ప్రభుత్వాల పరువు తీసాయి. ఆరేళ్ళ పిల్లవాడిని నిర్బంధించి బీహార్ పోలీసులు ఏం సాధించినట్టు? ఉత్తరాది అలా ఉంటే దక్షిణాదిన కేరళ, తమిళనాడు రాష్ట్రాల మీద ఆశ వదులుకున్న బిజెపి ఆంధ్రప్రదేశ్ లో ఏకోశానా నమ్మదగని తాత్కాలిక మిత్రుడి తోక పట్టుకొని ముందుకుపోతున్న స్థితిలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మీద పెట్టుకున్న ఆశలు, అధికారం కోసం కన్న కలలు కూడా నెరవేరవని ఎట్టకేలకు అర్థం చేసుకున్నట్టుంది. 2024లో సగానికి సగం లోకసభ సీట్లు గెలిచిన నాటి జోష్ ఏమాత్రం మిగలని స్థితికి చేరిన బిజెపి తెలంగాణలో త్వరలో పట్టణ ప్రాంతాల్లో జరగనున్న కార్పొరేషన్ల ఎన్నికల్లో తమ సత్తా చాటుకునే వ్యూహాలు రచిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. మరెందుకు ఇటీవల ప్రకటించిన పార్టీ నూతన జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు చోటు లేకుండా చేసింది? ఏం చేసినా తెలంగాణలో అధికారంలోకి రాలేం కాబట్టి తమ శక్తియుక్తులను అక్కడ వృథా చేసుకోవడం అనవసరమని భావించిందా? ఇది తప్పనిసరిగా జనంలోకి వ్యతిరేక సంకేతాలు పంపించే చర్య ఇదిలాఉంటే ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనను సగంలోనే ముగించుకొని తిరిగిరావడానికి కేంద్రమే కారణమై కాంగ్రెస్ పార్టీకి మరో




అస్త్రాన్ని అందించినట్టయింది. రేవంత్ రెడ్డి 10 రోజుల పాటు యునైటెడ్ కింగ్డమ్ (యుకే), అమెరికా దేశాల్లో 'తెలంగాణ రైజింగ్' పేరిట అధికారిక పర్యటన కోసం లండన్ వెళ్లారు. అక్కడి నుండి బోస్టన్, న్యూయార్క్ వెళ్లి ఆగస్టు 30న తిరిగి రావాల్సింది. రాష్ట్రప్రభుత్వం ముఖ్యమంత్రి పర్యటనకోసం నిబంధనల ప్రకారం విదేశాంగ మంత్రిత్వశాఖ నుండి అధికారికంగానే అనుమతి కోరింది. అయితే కేంద్రం యూకే పర్యటనకు అనుమతి ఇచ్చి రాజకీయ కోణంలో అమెరికా పర్యటనకు నిరాకరించి కాంగ్రెస్ చేతికి ఒక దివ్యాస్త్రాన్ని ఇచ్చేసింది. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతించకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 23న హైదరాబాద్ తిరిగి వచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం విదేశీ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ఉద్దేశించిన తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించి తెలంగాణను అవమానించిందని, వివక్షకు గురి చేసిందని ప్రకటించారు. ప్రధానమంత్రికి ఎరుక లేకుండానే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు విదేశాంగశాఖ అధికారులు అనుమతి నిరాకరించగలరా అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నకు అవతలనుండి సరైన జవాబు లేదు. అంతేకాదు, పట్టుమని పది రోజుల ముందు గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ 'వైబ్రంట్ గుజరాత్' పేరుతో పెట్టుబడుల సముపార్జన కోసం అమెరికా, కెనడా దేశాల్లో ఎనిమిది రోజులు పర్యటించడానికి అనుమతి ఎలా ఇచ్చారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా స్వరాష్ట్రమైన గుజరాత్ కు పెట్టుబడులు తెచ్చుకునేందుకు తెలంగాణకు అన్యాయం చేశారనే అభిప్రాయం రేవంత్ రెడ్డికి అనుమతి నిరాకరించడంతో తెలంగాణ ప్రజల్లోకి బలంగానే వెళ్లింది. ఇది తెలంగాణలో ఎప్పుడో ఒకసారి అధికారంలోకి వస్తాం అని కలలు కంటున్న భారతీయ జనతా పార్టీకి ఏమాత్రం లాభం చేసేది కాదు. అయితే రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీని, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ను కలుసుకోనున్నట్టు ప్రతిపాదించడమే ఆయన పర్యటనకు అనుమతి నిరాకరించడానికి కారణమని రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపించాయి. అయితే మమ్దానితో తనకు ఎటువంటి అప్పాయింట్మెంట్ లేదని స్పష్టం చేస్తూనే ముఖ్యమంత్రి 'ఆయనేం సంఘ వ్యతిరేకశక్తి కాదే, ప్రజలు ఎన్నుకున్న మేయర్' అన్నారు. దానికి కొనసాగింపుగా రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎవరికీ చెప్పాపెట్టకుండా పాకిస్తాన్ ఎందుకు వెళ్ళారు? అది స్నేహపూర్వక దేశమా? అని ప్రశ్నించారు. తెలంగాణలో కొందరు బిజెపి నాయకులు కూడా న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీని కలుస్తానంటే అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. జోహ్రాన్ మమ్దానీ పాకిస్తాన్ కు అనుకూలంగా ఉంటారని, వారి అభిప్రాయం. న్యూయార్క్ మేయర్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన వ్యక్తి. సహజంగానే ట్రంప్ వ్యతిరేకి. ఆయన భారతదేశానికి చెందిన ప్రముఖ సినీ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడు. మీరా నాయర్ ఒరిస్సా రాష్ట్రంలోని రూర్కెలాలో జన్మించారు. జన్మతః భారతీయురాలు. తర్వాత ఆమె విదేశాల్లో స్థిరపడ్డాక జన్మించిన వాడైన మమ్దానీ భారతదేశం పట్ల ఎంతో గౌరవప్రపత్తులు కలవాడు. నేను ఎరిగిన భారతదేశం లౌకికం. నేనెరిగిన భారతదేశం వేరు, ఆర్ఎస్ఎస్ కోరుకునే భారతదేశం వేరు అని కుండబద్దలు కొట్టినవాడు కాబట్టే బీజేపీకి ఆయనపట్ల అంత వ్యతిరేకత. ఒకవేళ రేవంత్ రెడ్డి ఆయనను కలుసుకోదలచినా ఆయన ట్రంప్ కు వ్యతిరేకి అయినంతమాత్రాన, ఆర్ఎస్ఎస్, బిజెపిల భావజాలాన్ని వ్యతిరేకించినంతమాత్రాన అదేదో దేశద్రోహం అన్న రీతిలో పరిగణించడం సరైనది కాదు. పెట్టుబడులు ఆకర్షించడానికో, మరింత నాణ్యమయిన విద్యకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకోడానికో అమెరికా పర్యటించదల్చుకున్న రేవంత్ రెడ్డికి అనుమతి ఇవ్వని కేంద్రం ఆర్ఎస్ఎస్ ముఖ్యనేత మోహన్ భాగవత్ పర్యటనతో భారతదేశానికి ఏ లాభం జరుగుతుందని అనుమతి ఇచ్చినట్టు అనే ప్రశ్న ఉత్పన్నం కావడం సహజం కదా. న్యూ యార్క్ ప్రథమ పౌరుడు మమ్దానీ తాను మోహన్ భాగవత్ పర్యటనకు దూరమేనని స్పష్టం చేసాడు. అయినా, లండన్ నుండి తిరిగి వచ్చాక పత్రికలవారితో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన కొన్ని మాటలు ఇక్కడ తప్పనిసరిగా ప్రస్తావించాలి. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా, ఉన్నతాధికారులైనా ఇతర దేశాలకు పర్యటన నిమిత్తం వెళ్ళినప్పుడు ఆయా దేశాలలోని భారత రాయబార కార్యాలయాలు మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని రూపొందించడమే కాకుండా వాటిని పర్యవేక్షించి ఆ సమావేశాల్లో జరిగే ప్రతి విషయాన్ని నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వానికి పంపించడం అధికారికంగా జరుగుతుంది. ఒకవేళ రేవంత్ రెడ్డి మమ్దానీని కలిసినా, జెడి వాన్స్ ని కలిసినా వారిమధ్య జరిగే సంభాషణలపై అక్షరం పొల్లుపోకుండా కేంద్రానికి నివేదిక అందుతున్నప్పుడు ఆయన పర్యటనను అడ్డుకొని ఏం సాధించినట్టు? దీనివల్ల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు బిజెపి వ్యతిరేకమని రాష్ట్ర ప్రజలలో ఉన్న అభిప్రాయం మరింత బలపడుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా మరికొంత జాగ్రత్తగా ఉండాల్సింది. ముఖ్యమంత్రి అధికార బృందంతో కలిసి యూకే, అమెరికా పర్యటన నిమిత్తం కేంద్రానికి అనుమతి కోసం ప్రతిపాదన పంపినప్పుడు అక్కడినుండి జవాబు వచ్చాకనే పర్యటన తేదీలు ఖరారు చేసుకుని ప్రకటించి ఉంటే సరిపోయేది. అయితే కాంగ్రెస్ కు ఇది రాజకీయంగా లాభం చేకూర్చేదే కాబట్టి ముఖ్యమంత్రి పర్యటనను కేంద్రం అడ్డుకున్నదనే అవమానం దానిముందు చాలా చిన్నదే అనిపిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించిన ఉదంతాన్ని కాంగ్రెస్ పార్టీ.. బిజెపి తెలంగాణ వ్యతిరేకి, ముఖ్యమంత్రి పర్యటనకు అనుమతి నిరాకరణ ద్వారా తెలంగాణను అవమానించింది అన్న అంశాన్ని జనంలోకి తీసుకువెళ్లగలిగింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రం నిర్ణయాన్ని ఖండిస్తూ రేవంత్ రెడ్డికి అనుకూలంగా స్పందించడం చూసాం. తెలంగా ణ కాంగ్రెస్‌లో అసమ్మతివాదం జోరందుకుంటున్నదా అన్న వాతావరణం మధ్యలో ఈ వ్యవహారం అంతా ఇక్కడి కాం గ్రెస్ ప్రభుత్వం నెత్తిమీద పాలు పోసిన చర్యగానే భావించాలి.

# నేపాల్ వరదలు ఓ గుణపాఠం

టిబెట్ ప్రాంతంలో సంభవించిన భూకంప తీవ్రతకు హిమనీ నద విస్ఫోటనం జరిగి, వివిధ నదుల్లో నీటి ప్రవాహం పెరిగి, ఆ ఉధృతికి నేపాల్ అతలాకుతమై, వరదలు ముంచెత్తాయి. వరద,బుర ద ఏకమై ఉప్పెనలా మారింది.ఈ ఆకస్మిక పరిణామాల ఫలితంగా చూస్తుండగానే వందలాది మంది ప్రజలు,పర్యాటకులు జల విధ్వంసంలో కొట్టుకుపోయి, విగత జీవులుగా మారిపోయారు. చాలా మంది వరద ప్రవాహంలో గల్లంతైపోయారు. పెద్ద పెద్ద భవంతులు పేకమేడల్లా కూలిపోయా యి. రోడ్లు, వంతెనలు కొట్టుకు పోయాయి. విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. నే పాల్ జల విధ్వంసంలో ఇప్పటి వరకు మరణించిన వారి సంఖ్య అంచనాలను మించి ఉండవచ్చు. మరణించిన వారిలోను,గల్లంతైన వారిలోను 30 దేశాలకు చెందిన పర్యాటకులున్నట్టు వార్తలు సూచిస్తున్నాయి.ఈ ఆకస్మిక వరదలకు భూకంపం ఒక కారణంగా అగుపిస్తున్నప్పటికీ, ఇంకా ఎన్నో అంశాలు ఈ జల విలయ విధ్వంసానికి కారణంగా పేర్కొంటున్నారు.రహదారులు,వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం వలన భూకంపాలు సంభవిస్తున్నా యి. దీనితో పాటు మానవ తప్పిదాల వలన ఉష్ణోగ్రతలు పెరుతున్నాయి. దీని వలన హిమనీ నదాలు కరగి జల ప్రళయం సంభవించడం జరుగుతున్నది. నేపాల్- చైనా సరిహద్దుల్లోకి వరద ముంచుకొచ్చింది.
భారత దేశానికి కూడా నేపాల్ వంటి పరిస్థితులు దాపురించవచ్చునని గత పరిణామాలు నిరూపిస్తున్నాయి. భారత్ లోని బీహార్,ఉత్తర ప్రదేశ్ లు నేపాల్ లో సంభవించిన వరద బీభత్సానికి ఉలిక్కిపడి, అప్రమత్తమయ్యాయి.నేపాల్ సరిహద్దులో ఉన్న టిబెట్ ప్రాంతంలో సంభవించిన భూకంపం ఈ జల విలయవిధ్వంసానికి కారణం. హిమాలయాల్లో పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటున్న సూచనలు కనిపిస్తున్నాయి.కొండలను పిండి చేసి,ప్రాజెక్టులను నిర్మించడం వంటి కారణాల వలన నదుల సహజ ప్రవాహ గతి మారతున్నది అలాగే ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడం వలన హిమనీ నదాలు కరిగి పోవడం జరుగుతున్నది. ఈ కారణాలన్నీ భవిష్యత్తులో



జరిగే జల విపత్తులకు కారణమవుతాయి.వరదలు,భూకంపాలు,తుఫానులు, సునామీలు ఇత్యాదులన్నీ సహజ విపత్తులు.ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం కలిగించి, విధ్వంసం చేసి, కోలుకోలేని విధంగా మానవజీవితాలను అతలాకుతలం చేసిన అనేక సంఘటనలు ఈ ప్రపంచంలో సంభవించాయి. అతివృష్టి వలన వరదలు సంభవించడం, ప్రజా జీవితాన్ని స్థంభింపచేయడం మనం చూస్తున్నాం. నేపాల్ లో సంభవించిన వరదలు కూడా భారీ విపత్తుగా పేర్కొనవచ్చు. జనజీవనానికి తీవ్ర విఘాతం కలిగించి,జీవనోపాధిని దెబ్బతీసి, ప్రాణాలకు,ప్రభుత్వ,ప్రజల ఆస్తులకు నష్టం కలిగించడంలో ప్రకృతి విపత్తుల పాత్ర అధికం. ప్రకృతి వైపరీత్యాల నుండి కోలుకుని,జనజీవనం సాధారణ స్థితికి రావడానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో ప్రజాజీవనాన్ని పునరుద్ధరించడానికి ప్రభుత్వాల,జాతీయ,అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతైనా అవసరం. మానవ జీవితాలను అతలాకుతలం చేసే ఇలాంటి ప్రమాదాలన్నీ సాధారణ స్థాయిని దాటి తీవ్రమైన స్థితికి చేరడం వలన విపరీతమైన ప్రాణనష్టం జరుగుతున్నది.ప్రకృతి వైపరీత్యాల్లో వాతావరణ పర్యావరణ,సంబంధమైన అంశా లు మిళితమై ఉన్నాయి. నేపాల్ లో సంభవించిన వైపరీత్యం లో కూడా అధిక భాగం మానవ ప్రేరితమే అని చెప్పక తప్పదు.భారత దేశం లోని పలు రాష్ట్రాలు వరదల వలన అస్తవస్తంగా మారుతున్నాయి. చినుకు పడితే చాలు రోడ్లన్నీ జలమయమై పోతున్నాయి. మానవ తప్పిదాలు మహోగ్రరూపం ధరించి మహా ఉపద్రవాలకు కారణభూతమవుతున్నాయి. ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించకపోవడమే ఈ వైపరీత్యాలకు కారణం.నేపాల్ లో జల ఖడ్గం ఝుళిపించిన స్వైర విహార విషాద దృశ్యాలు అత్యంత గగుర్పాటు కలిగిస్తున్నాయి.
ఈ నేపథ్యంలో భారత్ కూడా అప్రమత్తం కావాలి.కేరళ లోని వయనాడ్ జిల్లాలో సంభవించిన వరదల వలన ఏర్పడిన బురద నీటిలో ఎంతో మంది ప్రాణాలను కోల్పోయిన సంగతి మన స్మృతి పథం నుండి ఈనాటికీ తొలగి పోలేదు. దేశం లోని పలు రాష్ట్రాల్లో గతంలో అనేకమైన ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. నేటికీ ప్రకృతి ప్రళయాలు ప్రజలను పలకరిస్తూనే ఉన్నాయి. గతంలో ఉత్తరాఖండ్ లో భారీ వర్షాలు కురిసి వరదలు సంభవించి, ఎన్నో భవనాలు కుప్పకూలిపోయాయి. కొండ చరియలు విరిగి పడ్డాయి. రుద్ర ప్రయోగ, చమోలీ, తెహ్రీ, డెహ్రాడూన్ తదితర చోట్ల సంభవించిన వరద భీభత్సాన్ని మరచిపోలేము. వరదల వలన అనేక మంది చని పోతున్నారు. పర్యాటకులు, తీర్థ యాత్రలకు వచ్చేవారు వరదల వలన అనేక కష్టాలు పడడం చూస్తున్నాం. కేదార్ నాథ్ లో పలువురు ప్రయాణీకులు చిక్కుకు పోయి, అవస్థలు పడిన సంఘటన కూడా గుర్తుండే ఉంటుంది. కుండ పోత వర్షానికి ఇళ్లు మునిగి పోతున్నాయి. వరదల వలన రహదారులు,వంతెనలు కొట్టుకు పోతున్నాయి. ఉత్తరా ఖండ్,హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు గతంలో ఎదుర్కొన్న వరద సమస్యను గూర్చి వివరించనక్కర లేదు. ప్రకృతి విలయాలను ఆపే శక్తి మనకు లేకపోయినా, ఇలాంటి విలయాల వలన జరుగుతున్న ప్రాణనష్టాన్ని ముందు జాగ్రత్త చర్యలతో కొంతవరకు అడ్డుకట్ట వేయవచ్చు. భూతాపాన్ని అరికట్టడం, పర్యావరణ వ్యవస్థను కాపాడడం, భూకంపాలకు, వరదలకు కారణమవుతున్న పరిస్థితులను నివారించడానికి తక్షణ చర్యలను చేపట్టాలి. నేపాల్ లో జరిగిన వరద విలయ తీవ్రతను గుర్తించి, అలాంటి సం ఘటనల వలన ప్రాణ నష్టం జరగకుండా చూడాలి. భవిష్యత్తులో భారత్ లో జల ప్రళయం సంభవించకుండా తక్షణమే ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి.

vaartha sandhya వార్త సంధ్య తెలుగు దిన పత్రిక నిజం నిర్భయంగా మీ ముందుకు vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

# ప్రశాంతంగా నీట్--పీజీ 2026 పరీక్ష

**-జిల్లాలో 7 కేంద్రాలు.. 98.72 శాతం హాజరు**



**కర్నూలు రూరల్ (వార్త సంధ్య ) ఆగస్టు 30**
కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ జిల్లాలో నీట్--పీజీ 2026 ఆన్‌లైన్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,114 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 2,087 మంది పరీక్షకు హాజరయ్యారు. 27 మంది గైర్హాజరుకాగా, 98.72 శాతం హాజరు నమోదైంది. స్థానిక పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కె.వి.సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరుతో పాటు అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షను సజావుగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్ల తనిఖీతో పాటు ఇతర నిర్దేశిత విధానాలను సమర్థవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సహాయం, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ వివరించారు. అధికారులు సమన్వయంతో పనిచేయడంతో పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసిందన్నారు. కార్యక్రమంలో కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరులో పోలీసుల మెరుపు దాడి

**-40 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం..**

**-20 లీటర్ల నాటుసారా స్వాధీనం**



**నందికొట్కూరు, (వార్త సంధ్య ) ఆగస్టు 30**
నందికొట్కూరు పట్టణంలోని శికారిపేటలో నాటుసారా తయారీ జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 40 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అదే ప్రాంతానికి చెందిన శికారి రాజు వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శికారి రాజుపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నందికొట్కూరు పట్టణంలో నాటుసారా తయారీ, విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ అశోక్‌కుమార్ హెచ్చరించారు. భవిష్యత్తులోనూ నాటుసారా తయారీ, విక్రయాలపై దాడులు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి.

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.**



**మెదక్ జిల్లా (వార్త సంధ్య ) ఆగస్టు 30**
ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం, హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుంచి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు.
ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ వివరిస్తూ.. జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించి నోటీసులు జారీ చేసి యాప్ లో వివరాలు నవీకరించడం జరిగిందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియ నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని సీఈఓకు, కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మెదక్ ఆర్డీవో రమదేవి, ఎలక్షన్ సూపరింటెంట్ గఫార్, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లిలో ఎస్ఐఆర్ రీ-సర్వే గ్రామసభ నిర్వహణ



**దేవరకొండ (వార్త సంధ్య ) ఆగస్టు 30**
నాంపల్లిమండల పరిధిలోని నాంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల పోలింగ్ స్టేషన్ నంబర్ 324 పరిధిలో సమగ్ర భూ సర్వే గ్రామసభను శనివారం అధికారులు నిర్వహించారు. గ్రామంలోని రైతులు, భూ యజమానుల సమక్షంలో నిర్వహించిన ఈ సభలో సర్వే రికార్డులను పరిశీలించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ, సర్వే అధికారులు మాట్లాడుతూ.. సరిహద్దు తగాదాలు, భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వం పారదర్శకంగా రీ-సర్వే ప్రక్రియను తహసిల్దార్ అంబటి ఆంజనేయులు చేపడుతోందని తెలిపారు. సర్వే వివరాలపై భూ యజమానుల నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరించారు. రికార్డుల్లో ఏవైనా తప్పులుంటే ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సర్వే సిబ్బంది, గ్రామ రైతులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డుపై రణభేరి - 7 రోజుల్లో పనులు మొదలుపెట్టాలని పద్మా దేవేందర్ రెడ్డి అల్టిమేటం

**నందగోకుల్ నుంచి చెల్మెడ కమాన్ వరకు 8 కి.మీ భారీ పాదయాత్ర**



**రామాయంపేట (వార్త సంధ్య ) ఆగస్టు 30**
నందగోకుల్-నస్కల్-చెల్మెడ కమాన్ రహదారి పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం BRS ఆధ్వర్యంలో పాదయాత్ర నిలిచిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నందగోకుల్ హనుమాన్ ఆలయం నుంచి చెల్మెడ కమాన్ వరకు 8 కి.మీ మేర భారీ పాదయాత్ర చేపట్టారు. పద్మా దేవేందర్ రెడ్డి ఫైర్- గత BRS ప్రభుత్వంలోనే ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి.
- కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించకపోవడం, స్థానిక ప్రజాప్రతినిధుల కమీషన్ల వ్యవహారమే పనులు ఆగిపోవడానికి కారణం.
- రోడ్డుపై గుంతలు, బురదతో వర్షాకాలంలో ఆర్టీసీ బస్సులు, అంబులెన్సులు కూడా వెళ్లలేని పరిస్థితి.

**7 రోజుల డెడ్‌లైన్**
వారం రోజుల్లో పనులు మొదలుపెట్టకపోతే నందగోకుల్, నస్కల్, చెల్మెడ ప్రజలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
ఈ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, రామాయంపేట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, లావణ్య రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు జితేందర్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు రాగి ఉమామహేశ్వర్ హస్నావుద్దీన్, మధుకర్ బిఆర్ఎస్ సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గదా టాటూ అండ్ పియర్సింగ్ స్టూడియోను ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**రామగిరి, (వార్త సంధ్య ) ఆగస్టు 30**
ఆదివారం రోజు రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొల్లపల్లి రాజమల్లు కుమారుడు గొల్లపల్లి నరేష్ నూతనంగా ఏర్పాటు చేసిన 'గదా టాటూ అండ్ పియర్సింగ్ స్టూడియోను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ప్రారంభించారు. మంత్రి వెంట మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ పాల్గొన్నారు. రిబ్బన్ కట్ చేసి స్టూడియోను ప్రారంభించిన అనంతరం నిర్వాహకుడు నరేష్‌కు మంత్రి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.నూతనంగా ఏర్పాటు చేసిన ఈ స్టూడియో దినదినాభివృద్ధి చెందాలని, వ్యాపారంలో యువత మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి, స్థానిక సర్పంచ్ కొండవేణి దివ్య సుధాకర్, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**(వార్త సంధ్య ) ఆగస్టు 30 ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా**
గోపాల్ పేట్ మండలం పోల్కేపహాడ్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ బక్కమ్మ మనవరాలు వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై నూతన వధూవరులు వైష్ణవి ఢభాను ప్రకాష్ లకు శుభాకాంక్షలు తెలిపి అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మండల్ ఎన్. ఎస్.యు.ఐ అధ్యక్షుడు చరణ్ రాజ్, సీనియర్ నాయకులు తిరుపతయ్య,ఎంట్ల రవి, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఆశీర్వదించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**(వార్త సంధ్య ) ఆగస్టు 30 ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా**
పలు వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి వనపర్తి పట్టణం కేంద్రంలో శ్రీలక్ష్మీ కృష్ణ గార్డెన్ లో ఆంజనేయులు ఢమన్నెమ్మ కొడుకు వివాహానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై నూతన వధూవరులకు శ్రీనాథ్ ఢ లక్ష్మి హీరణ్మయి లకు శుభాకాంక్షలు తెలిపి అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఇందు గార్డెన్ లో శబరి ఢరాకేష్ ల వివాహానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై నూతన వధూవరులకు శబరి ఢరాకేష్ లకు శుభాకాంక్షలు తెలిపి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. పద్మావతి శ్రీనివాస గార్డెన్ లో అనిత రాజ వర్ధన్ రెడ్డి ఆహ్వానం మేరకు వివాహానికి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై నూతన వధూవరులు రమ్య రెడ్డి ఢ కిరణ్ కుమార్ రెడ్డి లకు శుభాకాంక్షలు తెలిపి అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మండల్ ఎన్.ఎస్. యు. ఐ అధ్యక్షుడు చరణ్ రాజ్, సీనియర్ నాయకులు ఎంట్ల రవి, బంధుమిత్రులు పాల్గొన్నారు.

వార్త సంధ్య


# పాకిస్తాన్‌లో 200 ఏళ్లనాటి చారిత్రక గురుద్వారా కూల్చివేత..



**న్యూఢిల్లీ, (వార్త సంధ్య ) ఆగస్టు 30**
నిత్యం మతసామరస్యం, మైనారిటీల సంక్షేమం గురించి ఇండియాకు నీతులు చెప్పే పాకిస్తాన్.. ఆ దేశంలో మాత్రం అది పాటించడం లేదు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉంటుంది. ఈ విషయం ఇప్పుడు మరోసారి రుజువైంది. పాకిస్తాన్‌లో ఉన్న 200 ఏళ్లనాటి చారిత్రక గురుద్వారాను అక్కడి ప్రభుత్వం కూల్చివేసింది. దీనిపై అక్కడి సిక్కు సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.పాకిస్తాన్‌లోని క్వెట్టా పట్టణంలో 200 ఏళ్లనాటి చారిత్రక గురుద్వారా ఉంది. దీని పేరు గురుద్వారా శ్రీ గురు సింగ్ సభ. ఒకప్పుడు ఈ ప్రాంతంలో సిక్కులు ఎక్కువగా ఉండేవారు. వాళ్లంతా ఇక్కడే చేరి ప్రార్థనలు చేసేవాళ్లు. సిక్కుల ఆధ్యాత్మిక సంస్కృతికి, చారిత్రక నేపథ్యానికి ఇది వారసత్వ సంపదగా నిలిచింది. అలాంటి, పవిత్ర గురుద్వారాను తాజాగా అక్కడి ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చేసింది. అది కూడా ఒక షాపింగ్ మాల్ నిర్మాణం కోసం ఈ గురుద్వారాను కూల్చేశారు. అయితే, ఈ గురుద్వారాను ఒక ప్రైవేటు బిల్డింగ్‌కు అమ్మేశారని అక్కడి ఒక సిక్కు నేత చెప్పాడు. కానీ, ఈ విషయంలో అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. అయితే, ఇలా గురుద్వారా కూల్చేయడంపై అక్కడి సిక్కులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే మొదటి ఘటన కాదంటున్నారు. ఇది ఒక బిల్డింగును కూల్చడం కాదని, తమ మతపరమైన సంప్రదాయాలు, జ్ఞాపకాల్ని చెరిపేయడమే అని వారు విమర్శిస్తున్నారు. ఈ కూల్చివేతను నిరసిస్తూ అక్కడి సిక్కులు బలూచిస్తాన్ హైకోర్టును ఆశ్రయించారు. కానీ, ఈ కూల్చివేతను అడ్డుకునేందుకు కోర్టు నిరాకరించింది. గతంలో ఈ ప్రాంతంలో 12 చారిత్రక గురుద్వారాలు ఉండేవి. ఇప్పుడు రెండు మాత్రమే ఉన్నాయి.

# రష్యా చమురుశుద్ధి కర్మాగారంపై డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్..!

**న్యూఢిల్లీ,(వార్త సంధ్య ) ఆగస్టు 30**



రష్యా లోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ డ్రోన్‌ల తో విరుచుకుపడింది. కిరిషి ప్రాంతంలోని ఒక చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి చేయడంతో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గతంలో ఇదే కర్మాగారాన్ని కీవ్ తీవ్రంగా దెబ్బతీయడంతో మాస్కో తిరిగి పునరుద్ధరించింది. మరికొద్ది రోజుల్లో కర్మాగారంలో పనులు తిరిగి ప్రారంభం అవ్వాల్సి ఉండగా ఈ దాడి జరగడం గమనార్హం. రోజుకు నాలుగు లక్షల బ్యారెళ్ల సామర్థ్యంగల ఈ ప్లాంట్ డీజిల్, గ్యాసోలిన్, ఫ్యూయల్ ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తుంది.ఉక్రెయిన్ ప్రయోగించిన దాదాపు 494 డ్రోన్లను విజయవంతంగా కూల్చేసినట్లు రష్యా వెల్లడించింది. ఈ నెలలో 20కి పైగా రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులు చేసినట్లు పేర్కొన్నది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌కు సరఫరాను కొనసాగించడానికి.. డీజిల్ ఎగుమతులపై నిషేధాన్ని పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. దాడులకు ప్రతిస్పందనగా ఉక్రెయిన్ ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. వరుస దాడులు కొనసాగుతుండడంతో రష్యాలో గ్యాసోలిన్ కొరత ఏర్పడింది. మరోవైపు శనివారం తెల్లవారుజామున కీవ్‌పై మాస్కో దాడి చేయడంతో పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన గిడ్డంగిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 38 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పేలుడు పరికరాలను గుర్తించి, నిర్వీర్యం చేయడానికి పైరోటెక్నిక్ బృందాలు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు.

# 18,600 అడుగుల ఎత్తులో డేరింగ్ ఆపరేషన్

**రోగిని కాపాడిన ఆర్మీ**



**న్యూఢిల్లీ, (వార్త సంధ్య ) ఆగస్టు 30**
లద్దాఖ్‌లోని నన్ కున్ పర్వత శ్రేణి సమీపంలో భారత సైనికులు చేపట్టిన అత్యంత సాహసోపేతమైన 'హై-ఆల్టిట్యూడ్' రెస్క్యూ ఆపరేషన్ విజయవంతమైంది. సుమారు 18,600 అడుగుల ఎత్తులో నిటారుగా ఉన్న కొండవాలు నుంచి ఓ రోగిని సైనిక సిబ్బంది సురక్షితంగా తరలించారు. అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో నిర్వహించిన ఈ ఆపరేషన్‌కు సంబంధించిన ఫొటోలను, వీడియోను భారత సైన్యానికి చెందిన ఫైర్ అండ్ ఫ్యూరీ కోర్ సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. ఈ రెస్క్యూ మిషన్‌కు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. ఆ ప్రాంతంలో గాలులు తీవ్రంగా వీయడంతోపాటు, సముద్రమట్టానికి చాలా ఎత్తులో ఉండటం వల్ల గాలి సాంద్రత తక్కువ. దీంతో హెలికాప్టర్ ఇంజిన్ పనితీరు, రోటర్ లిఫ్ట్, బరువును మోసే సామర్థ్యం తగ్గే పరిస్థితి ఏర్పడింది. రోగి ఉన్న ప్రదేశంలో హెలికాప్టర్‌ను పూర్తిగా ల్యాండ్ చేయడానికి సరైన స్థలం లేదు. ఈ పరిస్థితిని ముందుగానే అంచనావేసి, హెలికాప్టర్ బరువును తగ్గించే చర్యలు చేపట్టింది. రోగి వద్దకు చేరుకున్న తర్వాత పూర్తిస్థాయిలో ల్యాండింగ్ అవసరం లేకుండానే గ్రౌండ్ టీమ్ రోగిని హెలికాప్టర్‌లోకి తరలించింది. తాజా రెస్క్యూ ఆపరేషన్ భారత సైనికుల అసాధారణ నైపుణ్యం, ధైర్యసాహసాలను మరోసారి ప్రపంచానికి చాటింది

# సీన్ రివర్స్..రష్యాకు పెట్రోల్ ఎగుమతి చేస్తున్న భారత్..!

**న్యూఢిల్లీ, (వార్త సంధ్య ) ఆగస్టు 30**
అంతర్జాతీయ ఇంధన మార్కెట్ లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సీన్ రివర్స్ అయ్యింది. సాధారణంగా ముడి చమురు కోసం రష్యా పై ఆధారపడే భారత్.. ఇప్పుడు అదే రష్యాకు పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ (ఖనితీఖఅఅవ) డ్రోన్ దాడుల తో రష్యాలోని చమురుశుద్ధి కర్మాగారాలు తీవ్రంగా దెబ్బతినడమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు.చమురుశుద్ధి కర్మాగారాలు దెబ్బతినడంతో ఏర్పడిన తీవ్ర ఇంధన కొరతను అధిగమించేందుకు భారత్ నుంచి రష్యా పెట్రోల్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వోర్టెక్సా నివేదిక ప్రకారం.. గత రెండు నెలల్లో (జూలై-ఆగస్టు) రష్యా రిఫైనరీలపై సుమారు 32 సార్లు డ్రోన్ దాడులు జరిగాయి. దీనివల్ల దేశీయంగా పెట్రోల్ ఉత్పత్తి ఏకంగా 70 % పడిపోయింది. ఫలితంగా రష్యాలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రష్యా ప్రభుత్వం తన దేశం నుంచి పెట్రోల్, డీజిల్ ఎగుమతులను నిషేధించింది. ఈ నేపథ్యంలో భారత్






గత రెండు నెలల్లో దాదాపు 10 లక్షల బ్యారెళ్ల పెట్రోల్‌ను రష్యాకు సరఫరా చేసింది. భారత్‌తోపాటు తుర్కియే, మొరాకో కూడా రష్యాకు ఇంధనాన్ని అందిస్తున్నాయి. గుజరాత్‌లోని వడినార్‌లో ఉన్న నయారా ఎనర్జీ రిఫైనరీ నుంచే ఈ ఎగుమతుల్లో ఎక్కువ భాగం జరిగినట్లు వాణిజ్య వర్గాలు తెలిపాయి. ఈ రిఫైనరీలో రష్యా ప్రభుత్వ రంగ సంస్థ రాస్‌నెఫ్ట్‌కు వాటా ఉండటం గమనార్హం. మరోవైపు ప్రపంచంలో మూడో అతిపెద్ద రిఫైనరీగా ఉన్న భారత్ తన సామర్థ్యాన్ని 272 ఎంఎంటీపీఏ నుంచి 300 ఎంఎంటీపీఏకు పెంచుకోవడం ద్వారా గ్లోబల్ రిఫైనింగ్ హబ్‌గా తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పేర్కొన్నారు.జుఇవషిఅజవ దీతీఖఅఎష్ట్ర అదే సమయంలో ఇరాన్ యుద్ధం, హర్మూజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాల నేపథ్యంలో భారత్ తన ముడి చమురు దిగుమతులను కూడా విస్తృతం చేసుకుంది. ఒకప్పుడు 27 దేశాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకున్న భారత్.. ఇప్పుడు 41 దేశాల నుంచి కొనుగోలు చేస్తోంది. హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా నిలిచిపోవడంతో రష్యా నుంచి భారత్ ముడి చమురు దిగుమతులు రికార్డు స్థాయికి చేరాయి. అయితే కెప్లర్ డేటా ప్రకారం ఆగస్టులో దిగుమతులు కాస్త తగ్గి 2.1 మిలియన్ బ్యారెళ్లకు చేరాయి. అయినప్పటికీ దేశ మొత్తం దిగుమతుల్లో 40 % వాటాతో భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా రష్యానే కొనసాగుతోంది.

# సీజేపీకి రాజకీయ లక్ష్యాలు ఉండొచ్చు..

**రాజకీయాలకు అతీతంగా ఉంటేనే మేలు**
**సోనమ్ వాంగ్‌చుక్**

**న్యూఢిల్లీ, (వార్త సంధ్య ) ఆగస్టు 30**
కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి బహుశా రాజకీయ లక్ష్యాలు ఉండి ఉండవచ్చని ఉద్యమకారుడు, పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. తాజాగా ఆయన ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా సీజేపీతోపాటు, గత నెలలో తాను చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష సహా అనేక అంశాలపై మాట్లాడారు. అయితే, సీజేపీ రాజకీయాలకు అతీతంగా ఉంటేనే బాగుంటుందని సలహా ఇచ్చారు. "సీజేపీకి, దాని ఫౌండర్ అభిజీత్ దీప్కేకు రాజకీయ లక్ష్యాలు ఉన్నట్లు అనిపిస్తోంది. అయితే, ఈ విషయాన్ని వారేమీ నాకు చెప్పలేదు. ఇది నా అంచనా మాత్రమే.రాజకీయ లక్ష్యాలు ఉండటంలో



తప్పులేదు. సీజేపీ రాజకీయంగా మారితే యువతకు అనేక అవకాశాలు వస్తాయనేది నిజం. కానీ, ఇలాంటి ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా, తటస్థంగా ఉంచితేనే మంచిది. ప్రజలు సీజేపీని నిష్పక్షపాతంగా నడిచే యువత, విద్యార్థుల ఉద్యమ శక్తిగా చూస్తున్నారు. తటస్థంగా ఉంటూ, ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే సంస్థ అని భావిస్తున్నారు. ఇలా ఉంచితేనే అనేక లక్ష్యాలు సాధించవచ్చు. రాజకీయ శక్తిగాకంటే ఉద్యమ శక్తిగా ఉంచడమే మంచిది. అయితే, సమాజం నుంచి ఏమీ ఆశించకపోవడానికి సీజేపీ నేతలేమీ సన్యాసులు కాదు. నేను విశ్లేషించినంత వరకు వాళ్లు రాజకీయ శక్తిగా మారుతారు" అని వ్యాఖ్యానించారు. అభిజీత్ దీప్కే గతంలో ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉన్న విషయంపై తనకు అవగాహన లేదన్నారు. ఇక, తాను ఆమరణ దీక్ష చేస్తున్న సమయంలో దీక్ష విరమింపజేసే అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సంప్రదించామని, కానీ, ఈ విషయంలో ఆయన నుంచి సరైన స్పందన రాలేదన్నారు. ఈ విషయం పార్లమెంట్‌కు చేరాలని తాము భావించామన్నారు. రాహుల్ గాంధీ తమ దీక్షాస్థలికి వచ్చుంటే, అప్పుడు విషయానికి చాలా ప్రాధాన్యం దక్కేదని సోనమ్ వాంగ్‌చుక్ వివరించారు. కానీ, దీక్ష చేస్తున్నప్పుడు, ముగిసిన తర్వాత ఆయన తనను సంప్రదించలేదని వెల్లడించారు.

# కాబోయే ప్రధాని విజయ్ అంటూ జోరుగా ప్రచారం..

**-అధికార కూటిమిలో కలకలం..!**

**న్యూఢిల్లీ, (వార్త సంధ్య ) ఆగస్టు 30**
తమిళనాడు లో అధికారంలో ఉన్న 'తమిళగ వెట్రి కళగం ', దాని మిత్రపక్షం కాంగ్రెస్ మధ్య రాజకీయ విభేదాలు బహిర్గతమవుతున్నాయి. ముఖ్యమంత్రి సి జోసెఫ్ విజయ్ ని దేశానికి కాబోయే ప్రధానిగా కీర్తిస్తూ కొందరు టీవీకే నేతలు , మద్దతుదారులు చేస్తున్న ప్రచారం కూటమిలో తీవ్ర కలకలం రేపుతున్నది. ఈ పరిణామంపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.విజయ్‌ని ప్రధానిగా ప్రొజెక్ట్ చేస్తూ సాగుతున్న ఈ ప్రచారం వెనుక పార్టీ నాయకత్వాన్ని ఆకట్టుకోవాలనుకునే కొందరు టీవీకే నేతల ప్రయత్నం ఉన్నప్పటికీ.. ఇది కూటమి జాతీయ రాజకీయ వైఖరిపై గందరగోళం సృష్టిస్తుందని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తొలుత అసెంబ్లీలో మంత్రులు, ఎమ్మెల్యేలు విజయ్‌పై ప్రశంసలకే పరిమితమయ్యారు. కానీ ఇప్పుడు బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, ఉత్తర భారతదేశంలో ప్రచార వీడియోల రూపంలోకి విస్తరించింది. ఇది బీజేపీకి ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా




మారింది. ఇటీవల ఓ టెలివిజన్ ఛానల్ నిర్వహించిన సర్వే ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. ప్రధాని అభ్యర్థిగా ఎవరికి మద్దతిస్తారని అడిగిన ప్రశ్నకు.. రాహుల్ గాంధీ తర్వాత 9 శాతం మద్దతుతో విజయ్ మూడో స్థానంలో నిలిచారు. టీవీకే-కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే విజయ్‌ని ప్రధాని అభ్యర్థిగా ప్రచారం చేయడంపై కాంగ్రెస్ నేతలు అసహనంగా ఉన్నారు. మంత్రులు అభిమానుల్లా వ్యవహరిస్తున్నారని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ ఇటీవల చేసిన విమర్శలు ఈ అసంతృప్తిని స్పష్టం చేస్తున్నాయి. గతంలో రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా సమర్థించిన డీఎంకేతో పొత్తును వదులుకుని కాంగ్రెస్ పార్టీ టీవీకేతో చేతులు కలుపడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలు కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారాయి. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి మాట్లాడుతూ.. విజయ్ ప్రచారం ఒక ఎన్నికల వ్యూహమేనని, అయితే నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడంలో రాహుల్ గాంధీకి ఎవరూ సాటిరారని స్పష్టంచేశారు. ఈ వివాదంపై శనివారం మధురైలో రాష్ట్ర మంత్రి నిర్మల్ కుమార్ స్పందిస్తూ.. విజయ్ పట్ల దేశవ్యాప్తంగా ప్రజలకు ఆకాంక్షలు ఉన్నాయని, రాజకీయ పరిస్థితులను బట్టి సీఎం విజయ్ సరైన నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.ప్రభుత్వ విధానాలు అర్థంచేసుకోవడం వాస్తవానికి జాతీయ స్థాయిలో రాహుల్‌గాంధీని ముందుంచి, దక్షిణాదిలో విజయ్ ప్రజాదరణను ఉపయోగించుకోవాలన్నది కాంగ్రెస్ పార్టీ వ్యూహం. కానీ తాజా పరిణామాలతో ఆ వ్యూహం దెబ్బతిని, కూటమి భవిష్యత్తు, నాయకత్వ ప్రాధాన్యతలపై నీలినీడలు కమ్మాయి.

# మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతినబూనాలి..

**యువతకు పిలుపునిచ్చిన ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ, (వార్త సంధ్య ) ఆగస్టు 30**
క్షణికమైన ఆనందాన్నిచ్చే మత్తు పదార్థాలు ఉజ్వల భవిత ను దెబ్బతీసి వ్యక్తిగత జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతినబూనాలని యువతకు పిలుపునిచ్చారు. ఎలాంటి మత్తు పదార్థాలకైనా బానిసలు కాకుండా దూరంగా ఉండేలా మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అవగాహన కల్పించాలని కంటెంట్ క్రియేటర్లు, యూట్యూబర్‌లకు సూచించారు.ఇవాళ మన్ కీ బాత్ 137వ కార్యక్రమంలో మాట్లాడుతూ..



ఈ మేరకు యువతకు దిశానిర్దేశం చేశారు. 'మాదకద్రవ్య రహిత భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం యావత్తూ కలిసి రావాలని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి విముక్తులైన వారిని సమాజం అక్కున చేర్చుకుని గౌరవించాలన్నారు. సమాజ మద్దతు, యోగ, ధ్యానం, దృఢచిత్తం, ఆత్మవిశ్వాసం ద్వారా మత్తు పదార్థాలకు దూరం కావచ్చన్నారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో యువత పెద్ద మొత్తంలో హాజరవుతున్నారని పేర్కొన్నారు. వీధి వ్యాపారుల కోసం తీసుకువచ్చిన 'పీఎం స్వనిధి యోజన' లక్షలాది మంది మహిళలకు ఉపయోగపడుతోందని మోదీ పేర్కొన్నారు. దీని ద్వారా దాదాపు 46 శాతం మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించుకుంటూ.. ఆదాయాన్ని పెంచుకుంటున్న అంశాన్ని గుర్తుచేశారు.

# జీర్ణాశయంలో ఇన్ఫెక్షన్ వచ్చిందా.. ఈ ఆహారాలు తీసుకోండి!



కడుపులో ఇన్ఫెక్షన్, వాంతులు, విరేచనాలు వచ్చినప్పుడు జీర్ణవ్యవస్థకు విశ్రాంతి ఇవ్వాలనే ఉద్దేశంతో చాలామంది అరటిపండు, అన్నం, యాపిల్‌సాస్, టోస్ట్‌తో కూడిన 'బ్రాట్ డైట్'ను పాటిస్తుంటారు. అయితే ఈ నాలుగు ఆహారాలకే పరిమితం కావడం వల్ల శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. వాంతులు, తీవ్రమైన విరేచనాలు తగ్గిన తర్వాత క్రమంగా వైవిధ్యమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థ త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

**ఫైబర్‌ను క్రమంగా పెంచాలి**

కడుపు ఇన్ఫెక్షన్ కారణంగా శరీరంలో నీరు, ఎలక్ట్రోలైట్లు మాత్రమే కాకుండా శక్తి, విటమిన్లు, ఖనిజాలు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల లక్షణాలు తగ్గిన తర్వాత అరటిపండ్లు, ఓట్స్, యాపిల్స్, క్యారెట్లు, ఉడికించిన ఆలుగడ్డలు వంటి కరిగే ఫైబర్ ఉన్న ఆహారాలను క్రమంగా తీసుకోవచ్చు. సాల్యుబుల్ ఫైబర్ పేగుల్లో నీటిని పీల్చుకుని జెల్‌లా మారడం ద్వారా పలుచని విరేచనాలను నియంత్రించడంలో కొంత సహాయపడుతుంది. అంతేకాకుండా పేగుల్లోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాకు ఇది ఆహారంగా పనిచేస్తుంది. అయితే వాంతులు, తీవ్రమైన విరేచనాలు కొనసాగుతున్న సమయంలో పచ్చి కూరగాయలు, బ్రాన్, కొన్ని సంపూర్ణ ధాన్యాల్లో ఉండే కరగని ఫైబర్‌ను అధికంగా తీసుకోవడం మంచిది కాదు. దీంతో ఉబ్బరం, పేగుల్లో అసౌకర్యం పెరగవచ్చు. అందువల్ల ముందుగా తేలికగా జీర్ణమయ్యే ఆహారాలతో ప్రారంభించి, శరీరం తట్టుకునే స్థాయిని బట్టి ఫైబర్‌ను క్రమంగా పెంచాలి.

**ఈ ఆహారాలు ఉపయోగకరం**

విరేచనాలు తగ్గిన తర్వాత అరటిపండ్లు, ఓట్‌మీల్, యాపిల్‌సాస్, ఉడికించిన ఆలుగడ్డలు, ఉడికించిన క్యారెట్లు, కూరగాయలతో అన్నం, మెత్తని పండ్లు, కూరగాయల సూప్ వంటి ఆహారాలను తీసుకోవచ్చు. ఇవి జీర్ణవ్యవస్థపై ఎక్కువ భారం పడకుండా సాధారణ ఆహారానికి తిరిగి రావడానికి సహాయపడతాయి.

**నీరు, ఎలక్ట్రోలైట్లు తప్పనిసరి**

కడుపు ఇన్ఫెక్షన్ నుంచి కోలుకునే సమయంలో నీరు, ఎలక్ట్రోలైట్లను భర్తీ చేయడం అత్యంత ముఖ్యం. వాంతులు, విరేచనాల వల్ల శరీరంలో ద్రవాలు, ఖనిజ లవణాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల ఓఆర్ఎస్ వంటి ద్రవాలను తీసుకోవాలి. కొబ్బరి నీరు కూడా ద్రవాల భర్తీకి ఒక ఎంపికగా ఉంటుంది.

కడుపు ఇబ్బందిగా ఉన్నప్పుడు గంటల తరబడి ఆహారం పూర్తిగా మానేయడం కంటే.. తక్కువ పరిమాణంలో, తరచుగా తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. లక్షణాలు తగ్గుతున్న కొద్దీ తేలికగా జీర్ణమయ్యే ఆహారాలను క్రమంగా పెంచుకుంటూ సాధారణ, సమతుల్య ఆహారానికి తిరిగి రావాలి. తీవ్రమైన లేదా కొనసాగుతున్న వాంతులు, విరేచనాలు, నీరసం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరం.

# సలాడ్‌ను ఎక్కువగా తింటున్నారా.. అయితే జాగ్రత్త!



**హైదరాబాద్,**

సలాడ్ ఆరోగ్యకరమైన ఆహారం అనే భావన చాలామందిలో ఉంది. అయితే కూరగాయలతో నిండిన సలాడ్‌ను ఒకేసారి పెద్ద మొత్తంలో తీసుకోవడం వల్ల కొందరిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, భారంగా అనిపించడం, పొత్తికడుపులో అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీనికి కేవలం కూరగాయలే కారణం కాకుండా.. సలాడ్‌లోని పదార్థాల కలయిక, అధిక మొత్తంలో పచ్చి ఆహారం తీసుకోవడం కూడా కారణమవుతుందని వివరిస్తున్నారు.

**ఫైబర్ ఒక్కసారిగా పెంచొద్దు**

సలాడ్‌లో ఫైబర్ అధికంగా ఉండి, ప్రోటీన్, కేలరీలు తక్కువగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా పచ్చి ఉల్లిపాయలు, శనగలు, కిడ్నీ బీన్స్, కాలీఫ్లవర్, పుట్టగొడుగులు, యాపిల్స్, డ్రై ఫ్రూట్స్ వంటి కొన్ని పదార్థాల్లో ఫెర్మెంటబుల్ కార్బొహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. వీటిని ఒకేసారి పెద్ద మొత్తంలో తీసుకుంటే సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు రావచ్చు.

అలాగే సాధారణంగా తక్కువ ఫైబర్ తీసుకునేవారు ఒక్కసారిగా పెద్ద గిన్నె నిండా పచ్చి కూరగాయలు తినడం ప్రారంభించినా జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. అందువల్ల ఫైబర్ పరిమాణాన్ని క్రమంగా పెంచుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

**డ్రెస్సింగ్‌తోనూ సమస్యలు**

సలాడ్ ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ దానికి ఉపయోగించే డ్రెస్సింగ్‌ను కూడా గమనించాలి. మార్కెట్‌లో లభించే కొన్ని డ్రెస్సింగ్స్‌లో ఉల్లిపాయ, వెల్లుల్లి పొడి, చికోరి రూట్, షుగర్ ఆల్కహాల్స్, ప్రిజర్వేటివ్‌లు, ఇతర సంకలిత పదార్థాలు ఉండొచ్చు. ఇవి కొందరిలో ఉబ్బరానికి కారణమయ్యే అవకాశం ఉంది. డ్రెస్సింగ్‌లో అధిక కొవ్వు ఉంటే కడుపు ఖాళీ అయ్యే ప్రక్రియ నెమ్మదించి, ఎక్కువసేపు కడుపు నిండినట్లు అనిపించవచ్చు.

**వండిన కూరగాయలతో ప్రారంభించండి**

జీర్ణవ్యవస్థ సున్నితంగా ఉన్నవారు పెద్ద మొత్తంలో పచ్చి కూరగాయలు తీసుకోవడం కంటే ఆవిరిపై ఉడికించినవి, రోస్ట్ చేసినవి లేదా స్వల్పంగా వండిన కూరగాయలతో ప్రారంభించడం మంచిది. సలాడ్‌ను ప్రధాన భోజనంగా కాకుండా భోజనంలో ఒక భాగంగా తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. గ్రిల్డ్ చికెన్, చేపలు, గుడ్లు, టోఫు, పనీర్ వంటి ప్రోటీన్ వనరులను కూడా చేర్చుకోవచ్చు.

అవసరాన్ని బట్టి అన్నం, క్వినోవా, మిల్లెట్స్, స్వీట్ పొటాటో వంటి కాంప్లెక్స్ కార్బొహైడ్రేట్లను కూడా సమతుల్యంగా తీసుకోవచ్చు. పచ్చి ఉల్లిపాయలకు బదులుగా స్ప్రింగ్ ఆనియన్, యాపిల్స్‌కు బదులుగా బెర్రీలు, కాలీఫ్లవర్, పుట్టగొడుగులకు బదులుగా కీరదోస, క్యారెట్, గుమ్మడికాయ, జుక్కిని వంటి వాటిని ఎంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

పెద్ద గిన్నె నిండా సలాడ్ తినడమే ఆరోగ్యకరమైన ఆహారానికి కొలమానం కాదు. శరీరానికి అనుకూలంగా ఉండే మోతాదులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కాంప్లెక్స్ కార్బొహైడ్రేట్లు, ఫైబర్‌ను సమతుల్యంగా తీసుకోవడమే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.

# నేచర్స్ ఓజెంపిక్'.. నిజంగా బరువు తగ్గిస్తుందా?



హైదరాబాద్, ఆగస్టు 30

బార్బెర్రీ మొక్క నుంచి లభించే బెర్బెరిన్‌ను కొందరు 'నేచర్స్ ఓజెంపిక్'గా ప్రచారం చేస్తున్నారు. ఇది రక్తంలో చక్కెర నియంత్రణ, ఇన్సులిన్ సెన్సిటివిటీ, కొవ్వు జీవక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే బెర్బెరిన్ తీసుకోవడం వల్ల గణనీయంగా బరువు తగ్గుతుందని నిర్ధారించే బలమైన ఆధారాలు లేవు. కొన్ని పరిశోధనల్లో స్వల్ప మార్పులు మాత్రమే కనిపించాయి. కాబట్టి దీన్ని ఓజెంపిక్ వంటి జీఎల్‌పీ-1 మందులకు సహజ ప్రత్యామ్నాయంగా భావించడం సరికాదని నిపుణులు చెబుతున్నారు. మధుమేహం మందులు వాడేవారు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు వైద్యుల సలహా లేకుండా బెర్బెరిన్ సప్లిమెంట్లు తీసుకోకూడదు. బరువు తగ్గేందుకు సమతుల్య ఆహారం, వ్యాయామం, తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇనుప కండలు పెరగాలంటే!




ఐరన్ లోపం ఉంటే తక్కువగా శ్వాస తీసుకోవడం, నీరసం, ఎంతకీ తగ్గని తలనొప్పి లక్షణాలు ఉంటాయి. ఆ లోపాన్ని సరిచేసుకునేందుకు ఐరన్ అధికంగా ఉన్న ఆహారం తిన్నా కొంతమంది ఆ సమస్యల నుంచి బయటపడలేరు. తినే ఆహారంలో ఐరన్ అధికంగా ఉన్న పదార్థాలు చేర్చుతారు. కానీ, కొందరి శరీరం దానిని పూర్తి స్థాయిలో గ్రహించే సామర్థ్యం కలిగి ఉండదు. అప్పుడు ఎంత తిన్నా లాభం ఉండదు. ఈ విషయం పట్ల అవగాహన లేక, రక్తహీనతతో బాధపడేవాళ్లు మాంసం, గుడ్లు, బీట్‌రూట్ మొదలైనవి తినడం మీదనే దృష్టి పెడతారు. ఆ ఆహారంలోని ఐరన్‌ని జీర్ణ వ్యవస్థ గ్రహించాలంటే శరీరంలో విటమిన్-సి లోపం ఉండకూడదు. విటమిన్-సి ఇనుముని గ్రహించే సామర్థ్యాన్ని పెంచుతుంది. కాబట్టి మాంసం తినేటప్పుడు ఓ నిమ్మ చెక్క పిండుకుంటే మంచిది. శాకాహారులు ప్రతి ఉదయం నిమ్మ రసం తాగే అలవాటు చేసుకుంటే ఐరన్ సంగ్రహణే కాదు జీర్ణవ్యవస్థ కూడా సాఫీగా సాగిపోతుంది. ఈ అలవాటు లేకపోతే వారంలో రెండు (సార్లు) రోజులు బత్తాయి జ్యూస్ తాగితే మంచిది. ఐరన్ కోసం ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తింటే శరీరం ఇనుప కండలతో రాటు దేలుతుంది!



రెడ్ మిర్చిలా మీనాక్షి చౌదరి.. మట్టికుండతో పూజాహెగ్డే


# 'ది ప్యారడైజ్' నుంచి మాస్ జాతర..

## -యూట్యూబ్‌లో నంబర్ 1గా దూసుకెళ్తున్న 'ఏశనాగుల' సాంగ్!



న్యాచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఒదేల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా నుంచి విడుదలైన 'ఏశనాగుల' పాట సోషల్ మీడియాలో మాస్ జాతర సృష్టిస్తోంది. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ సాంగ్ యూట్యూబ్‌లో ఇండియా వ్యాప్తంగా నంబర్ 1 ట్రెండింగ్ స్థానానికి చేరి దూసుకెళ్తోంది. 'ది ప్యారడైజ్' సినిమాకు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. 'ఏశనాగుల' పాటకు ఆయన అందించిన పవర్‌ఫుల్ మాస్ బీట్స్ సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ జానపద శైలికి మోడ్రన్ మ్యూజికల్ టచ్ జోడించి రూపొందించిన ఈ పాటకు మంచి స్పందన వస్తోంది.ప్రముఖ రచయిత కాసర్ల శ్యామ్ అందించిన పల్లెటూరి నేటివిటీతో కూడిన సాహిత్యం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక ప్రభా బంగారిగళ్ల, అద్దుల జంగిరెడ్డిలు తమ ప్రత్యేకమైన గాత్రంతో ఈ పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. జానపద ఫీల్‌తో పాటు మాస్ ఎనర్జీ కలగలిపిన ఈ సాంగ్ ప్రస్తుతం అన్ని వర్గాల శ్రోతలను ఆకట్టుకుంటోంది. యూట్యూబ్‌లో విడుదలైన వెంటనే 'ఏశనాగుల' పాటకు భారీ స్పందన లభించింది. శరవేగంగా వ్యూస్, లైక్స్, షేర్స్ పెరుగుతూ ఈ పాట ఇండియా వ్యాప్తంగా ట్రెండింగ్ జాబితాలో అగ్రస్థానానికి చేరింది. మ్యూజిక్ లవర్స్‌తో పాటు నాని అభిమానులు ఈ పాటను సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ చేస్తున్నారు. ముఖ్యంగా పాటలోని పవర్‌ఫుల్ బీట్స్‌కు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో భారీ స్థాయిలో వీడియోలు రూపొందిస్తున్నారు. దీంతో విడుదలైన కొద్ది సమయంలోనే ఈ సాంగ్ సోషల్ మీడియా ట్రెండ్‌గా మారిపోయింది. 'ఏశనాగుల' పాటలో నాని కనిపించిన మాస్ అండ్ రస్టిక్ అవతార్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. న్యాచురల్ నటనతో ప్రేక్షకులను మెప్పించే నాని.. ఈసారి పూర్తి భిన్నమైన, రఫ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించబోతున్నారనే అంచనాలను ఈ పాట మరింత పెంచేసింది. నాని స్క్రీన్ ప్రెజెన్స్, రస్టిక్ మాస్ వైబ్, అనిరుధ్ పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ బీట్స్ కలిసి పాటకు ప్రధాన బలంగా నిలిచాయి. గతంలో ఎన్నడూ చూడని విధంగా నాని ఈ సినిమాలో కనిపించబోతున్నారనే చర్చ అభిమానుల్లో జరుగుతోంది. బ్లాక్‌బస్టర్ 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఒదేల కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో 'ది ప్యారడైజ్'పై మొదటి నుంచే భారీ హైప్ ఉంది. 'దసరా'లో నాని రస్టిక్ మాస్ అవతార్‌ను అద్భుతంగా ప్రజెంట్ చేసిన శ్రీకాంత్ ఒదేల.. ఇప్పుడు 'ది ప్యారడైజ్'లో అంతకుమించి విభిన్నమైన ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఓటీటీలోకి 'కొరియన్ కనకరాజు'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'. థియేటర్లలో ప్రేక్షకులను కడుపుబ్బా నవించిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో సెప్టెంబర్ 4, 2026 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తుంది. తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రాబోతుంది. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, సత్య కామెడీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాను ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యువి క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. థియేటర్లలో అలరించిన ఈ మూవీ ఓటీటీలో ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన కనకరాజు (వరుణ్ తేజ్) చెక్కభజన ప్రదర్శనలు చేస్తూ సరదాగా గడిపేస్తుంటాడు. కియా ఫ్యాక్టరీలో పనిచేసే చైత్ర (రితికా నాయక్)ను ప్రేమిస్తాడు. ఇదే సమయంలో కొరియా నుంచి వచ్చిన ఓ గ్యాంగ్‌స్టర్ ఆత్మ కనకరాజు శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ ఆత్మ ఎవరిది? దాని లక్ష్యం ఏమిటి? దాని నుంచి బయటపడేందుకు కనకరాజు ఎందుకు కొరియా వెళ్లాల్సి వచ్చింది? అనేదే మిగతా కథ.

## నాగార్జున 100వ సినిమాలో

# క్రేజీ బ్యూటీ ఐశ్వర్య రాజేష్

టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రం 'కింగ్ 100'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమాలో ప్రముఖ నటి ఐశ్వర్య రాజేష్ కూడా భాగమవుతున్నట్లు అధికారికంగా కన్ఫర్మ్ కావడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. నాగార్జున 100వ సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ హైప్ నెలకొంది. దర్శకుడు ఆర్.ఏ. కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్ ఇటీవల విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మాస్, యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతుందనే సంకేతాలను ఈ గ్లింప్స్ ఇచ్చింది. దీంతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై అక్కినేని అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు.ఇక 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైన ఐశ్వర్య రాజేష్ 'కింగ్ 100'లో నటిస్తున్నారనే వార్త గత కొంతకాలంగా ప్రచారంలో ఉంది. అయితే చిత్రబృందం నుంచి ఇప్పటివరకు దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. తాజాగా ఐశ్వర్య రాజేష్ స్వయంగా 'కింగ్ 100' గ్లింప్స్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేయడంతో ఆమె ఈ సినిమాలో భాగమన్న విషయం స్పష్టమైంది. దీంతో నాగార్జునతో ఐశ్వర్య రాజేష్ తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. అయితే ఈ సినిమాలో ఆమె పాత్ర ఏమిటి? నాగార్జునతో ఆమెకు ఎలాంటి సంబంధం ఉంటుంది? హీరోయిన్‌గా కనిపిస్తారా లేక కథలో కీలకమైన మరో పాత్ర పోషిస్తారా? అన్న విషయాలపై మాత్రం మేకర్స్ ఇప్పటివరకు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఆమె పాత్రను పూర్తిగా సీక్రెట్‌గా ఉంచుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఇప్పటికే టబు కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. నాగార్జున--టబు కాంబినేషన్ గతంలో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. చాలా ఏళ్ల తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ ఒకే సినిమాలో కనిపించనుండటంతో అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. సుస్మితా భట్ కూడా ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. 'కింగ్ 100'కు సంగీతం అందిస్తున్నది రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్. నాగార్జున--డీఎస్పీ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకున్న నేపథ్యంలో, ఈ మైల్‌స్టోన్ మూవీకి ఆయన ఎలాంటి ఆల్బమ్ అందిస్తారన్న ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా టైటిల్ గ్లింప్స్‌కు వచ్చే స్పందనతో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. 'కింగ్ 100' చిత్రాన్ని డిసెంబర్ 24, 2026న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



## అల్లరి నరేష్ చిత్రానికి

# సెన్సార్ అడ్డంకులు..

### టాలీవుడ్‌లో కొత్త టెన్షన్!




టాలీవుడ్‌లో సెన్సార్ నిబంధనలు చిత్రసీమ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. విడుదలకు ముందు వస్తున్న ఊహించని అభ్యంతరాలతో నిర్మాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' సెన్సార్ అడ్డంకుల కారణంగా సెప్టెంబర్ 3న విడుదల కావడంపై సందిగ్ధత నెలకొంది. ఈ చిత్రంలోని రంభ, ఊర్వశి, మేనక పాత్రలు ధరించిన దుస్తులపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ పాత్రలను గ్లామరస్‌గా కాకుండా సాంప్రదాయ చీరలలో చూపించాలని అధికారులు సూచించినట్లు తెలుస్తోంది. సమస్య పరిష్కారం కాకపోతే మేకర్స్ రివైజింగ్ కమిటీని ఆశ్రయించాల్సి వస్తుంది.టాలీవుడ్‌లో సెన్సార్ నిబంధనలు చిత్రసీమ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. విడుదలకు ముందు వస్తున్న ఊహించని అభ్యంతరాలతో నిర్మాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' సెన్సార్ అడ్డంకుల కారణంగా సెప్టెంబర్ 3న విడుదల కావడంపై సందిగ్ధత నెలకొంది. ఈ చిత్రంలోని రంభ, ఊర్వశి, మేనక పాత్రలు ధరించిన దుస్తులపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ పాత్రలను గ్లామరస్‌గా కాకుండా సాంప్రదాయ చీరలలో చూపించాలని అధికారులు సూచించినట్లు తెలుస్తోంది. సమస్య పరిష్కారం కాకపోతే మేకర్స్ రివైజింగ్ కమిటీని ఆశ్రయించాల్సి వస్తుంది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.